మహబూబ్‌నగర్



వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల/నారాయణపేట

# సీఎం సభకు చకచకా పనులు

**- ఏర్పాట్లను పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, ఐజి,ఎమ్మెల్యే జీఎంఆర్ ఇతర అధికారులు**

**భూత్పూర్,నవంబరు 27,ప్రభాతవార్త:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్న సందర్భంగా రాష్ట్ర ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఈ నెల 30న మధ్యాహ్నం నాలుగు గంటలకు మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ ప్రజాపాలన విజయోత్సవ సభకు విచ్చేయుచున్న సందర్భంగా ఏర్పాట్లను గత మూడ్రోజులుగా పనులు చకచకా నిర్వహిస్తున్నారు. సభ జరిగే ప్రాం గణాన్ని పలువురు ప్రముఖులు సందర్శించి ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. సీఎం సొంత జిల్లా అయినందున విజయోత్సవ సభను ప్రతిష్టాత్మకంగా నిర్వ హించాలని మంత్రి జూపల్లి,రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ చిన్నారెడ్డి, ఎమ్మెల్యేలు జి మధుసూధన్‌రెడ్డి(జీఎం ఆర్-దేవరకద్ర),యెన్నెం శ్రీనివాస్‌రెడ్డి(మహబూబ్‌నగర్) ఎప్పకప్పుడు ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షిస్తూన్నారు.



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

**ఇది రైతుల పండుగ : దేవరకద్ర ఎమ్మెల్యే జీఎంఆర్**

సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది గడుస్తున్న సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లా పాలమూరులో ఈ నెల 30న భూత్పూర్‌లో ప్రజాపాలన విజయోత్సవ సభ సందర్భంగా సభతో పాటు రైతు సదస్సు నిర్వహిస్తున్నామని,ఉమ్మడి పాలమూరు జిల్లాల నుంచి దాదాపు లక్షమంది రైతులు హాజరౌతున్నారని ఎమ్మెల్యే జీఎంఆర్ స్పష్టం చేశారు. బుధవారం ఎమ్మెల్యే భూత్పూర్‌లో నిర్వహించే సీఎం సభా ప్రాంగణాన్ని సందర్శించి ఏర్పట్లను పర్యవేక్షించారు.రైతు సదస్సుకు ఏర్పాటు చేస్తున్న స్టాల్స్,సభాస్థలి,సీఎం కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసి హెలిప్యాడ్ స్థలాన్ని ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే జీఎంఆర్ మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ప్రభుత్వమని,రైతులకు రుణమాఫీ,బోనస్ రు.500లు సీఎం రేవంత్‌రెడ్డి రైతుల ఖాతాలోకి వేస్తున్నారని తెలిపారు.కాంగ్రెస్ ప్రజాపాలన విజయోత్సవ సభ అంటేనే రైతుల పండుగన్నారు. సీఎం రాకకు రెండ్రోజుల ముందే రైతుల సదస్సును నిర్వహిస్తున్నామని చెప్పారు.ఉమ్మడి పాలమూరు జిల్లాల నుంచి దాదాపు లక్ష మంది రైతులు ఈ సదస్సుకు హాజరౌతారన్నారు.రైతుల అవగాహన సదస్సులో స్టాల్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.రైతులకు నూతన ఆధునిక వ్యవసాయ పద్దతుల్ని వివరించేందుకు శాస్త్రవేత్తలను రప్పిస్తున్నట్లు చెప్పారు.రైతులకు స్వల్పపాటి శిక్షణను ఇచ్చేందుకు రాష్ట్ర వ్యవసాయశాఖ మినీథియేటర్ (స్క్రీన్)ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఇంతవరకు తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి రఘునందన్ రావు,జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి,అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్‌లు ఎప్పటి కప్పుడు పరవేక్షి స్తున్నారని అన్నారు.మీడియా సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి,మాజీ ఎంపి కదిరే శేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి లిక్కి విజయ్ కుమార్‌గౌడ్,మండల యువజన కాంగ్రెస్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆగిరి రవి ఇతర నాయకులు పాల్గొన్నారు.

# ఈవీఎంలు అత్యంత సురక్షితమైనవిగా సుప్రీంకోర్టు తీర్పు

**జిల్లా ఎన్నికల అధికారి సిక్త పట్నాయక్**

**నారాయణపేట టౌన్, నవంబరు 27 ప్రభాతవార్త :** భారతదేశంలో ఎన్నికల నిర్వహణకు వినియోగించే ఈవీయంలు అత్యంత సురక్షితమైనవిగా అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీర్పును ఇచ్చినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్ నేడు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈవియంలను ట్యాంపరింగ్ చేయొచ్చని పేర్కొంటూ మళ్ళీ బ్యాలెట్ పేపర్లకు అమల్లోకి తేవాలని కోరుతూ కొందరు వ్యక్తులు ఇటీవల సుప్రీం కోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారని, పీల్ ను పరిశీలించిన సుప్రీం కోర్టు ధర్మాసనం కేసును కొట్టి వేస్తున్నట్టు తీర్పులు వెలువరించారని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తులు విక్రమ్ నాథ్, పి.బి. వరాలే ఈ అంశంపై విచారణ జరిపిన అనంతరం పిటిషన్ ను కొట్టివేస్తూ సంచలన తీర్పును వెలువరించారన్నారు. నాయకులు ఎన్నికల్లో గెలిచినప్పుడు ఈవీఎంలు కరెక్ట్ అని చెప్పడం, ఓటమి పాలైనప్పుడు మాత్రం ఈవీఎంలపై అనుమానాలు వ్యక్తపరచడం సరికాదని న్యాయస్థానం పేర్కొన్నట్లు తెలియజేశారు. ఈ తీర్పు ఈవీఎంల విశ్వాసనీయతకు మద్దతుగా, ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందనడానికి రుజువుగా నిలుస్తుందని కలెక్టర్ తెలిపారు. ఓటర్లు అందరూ ఎన్నికల ప్రక్రియ, భారత ఎన్నికల సంఘంపై నమ్మకం కలిగి ప్రజాస్వామ్య బద్ధంగా నిర్వహించే ఎన్నికలలో చురుకుగా పాల్గొనాలని ఆమె కోరారు.



కలెక్టర్ సిక్తా పట్నాయక్

# విద్యార్థులతో కలిసి భోజనం చేసిన రాష్ట్ర స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్

**మాగనూరు, నవంబరు 27 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా లోని మాగనూరు జెడ్పి ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. (ఈ నెల 26న) మంగళవారం ఆ పాఠశాలలో కలుషిత ఆహారం వల్ల 22 మంది విద్యార్థులు విద్యార్థులు అస్వస్థతకు గురైన సంఘటనపై క్షేత్రస్థాయిలో విసరణ జరిపేందుకు ఆ పాఠశాలను సందర్శించిన ఆయన జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎస్పీ యోగేష్ గౌతమ్ తో కలిసి ఘటన తాలూకు విచారణను అన్ని కోణాల్లో జరిపిన అనంతరం విద్యార్థులతో పాటు అక్కడ వండిన మధ్యాహ్న భోజనాన్ని ( అన్నం, పాలకూర పప్పు) తిన్నారు. పాఠశాలలోని డైనింగ్ హాల్‌లో ఆ పాఠశాల విద్యార్థులు విద్య, సౌజన్య, నిహారిక, మహేశ్వరి ల పక్కన కూర్చున్న స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, కలెక్టర్, ఎస్పీ మధ్యాహ్న భోజనాన్ని సంతృప్తిగా ఆరగించారు. అనంతరం స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ మాట్లాడుతూ.. పాఠశాలలో మధ్యాహ్న భోజనం బాగుందని స్పష్టం చేశారు. రోజూ ఇలాగే నాణ్యతతో కూడిన భోజనాన్ని అందజేయాలని అధికారులు, ఉపాధ్యాయులు, వంట ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. ఈ పాఠశాలలో మూడు సార్లు కలుషిత ఆహారం ఘటన చోటు చేసుకోవడం చాలా దుర దృష్టకరమని, దీనిపై సమగ్ర విచారణ చేపట్టామని, వారం రోజుల క్రితం జరిగిన ఘటనలో బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకున్నామని గుర్తు చేశారు. ఇకపై ప్రతి రోజూ పాఠశాలలోని ఉపాధ్యాయుల కమిటీ రొటేషన్ పద్ధతిన, అలాగే పాఠశాలలో విద్యార్థులలో కూడిన ఫుడ్ కమిటీ సభ్యులు మధ్యాహ్న భోజనాన్ని పర్యవేక్షిస్తారని, మధ్యాహ్న భోజనం ఆ కమిటీ సభ్యులు తిన్న తర్వాతే విద్యార్థులకు వడ్డించడం జరుగుతుందని ఆయన తెలిపారు. మూడు పర్యాయాలు జరిగిన ఘటన దరిమిలా పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అధైర్య పడకుండా, వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు తాను ఇక్కడికి రావడం జరిగిందని ఆయన చెప్పారు. ఇక ముందు ఇలాంటి ఘటన పునరావృతం కాకుండా అన్ని రకాల ముందస్తు జాగ్రత్త చర్యలు అధికారులు, ఉపాధ్యాయులు తీసుకునేలా స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం జరిగిందని ఆయన తెలిపారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డైరెక్టర్ వెంకట నరసింహారెడ్డి,జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

# ఈవీఎంలు సురక్షితమైనవి : కలెక్టర్ బి. ఎం. సంతోష్

**గద్వాల,నవంబరు 27 ప్రభాతవార్త :** భారతదేశంలో ఎన్నికల నిర్వహణకు వినియోగించే ఈవీయంలు అత్యంత సురక్షితమైనవిగా అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీర్పును ఇచ్చినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బి.ఎం.సంతోష్ నేడు ఒక ప్రకటనలో తెలియజేశారు.ఈవియంలను ట్యాంపరింగ్ చేయొ చ్చని పేర్కొంటూ మళ్ళీ బ్యాలెట్ పేపర్లకు అమల్లోకి తేవాలని కోరుతూ కొందరు వ్యక్తులు ఇటీవల సుప్రీం కోర్టులో ప్రజా ప్రయోజన వ్యా జ్యం దాఖలు చేశారని,పీల్‌ను పరిశీలించిన సుప్రీంకోర్టు ధర్మాసనం కేసును కొట్టి వేస్తున్నట్టు తీర్పులు వెలువరిం చారని జిల్లాఎన్నికల అధికారి తెలిపారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తులు విక్రమ్‌నాథ్, పి.బి.వరాలే ఈ అంశంపై విచారణ జరిపిన అనంతరం పిటిషన్‌ను కొట్టివేస్తూ సంచలన తీర్పును వెలువరించారన్నారు. నాయకులు ఎన్నికల్లో గెలిచినప్పుడు ఈవీఎంలు కరెక్ట్ అని చెప్పడం, ఓటమి పాలైనప్పుడు మాత్రం ఈవీఎంలపై అనుమానాలు వ్యక్తపర చడం సరికాదని న్యాయస్థానం పేర్కొన్నట్లు తెలి యజేశారు. ఈతీర్పు ఈవీఎంల విశ్వాసనీయతకు మద్దతుగా, ఎన్నిక ల ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుం దనడానికి రుజువుగా నిలుస్తుందని కలెక్టర్ తెలిపారు. ఓటర్లు అందరూ ఎన్నికల ప్రక్రియ, భారత ఎన్నికల సంఘంపై నమ్మకం కలిగి ప్రజాస్వామ్య బద్ధంగా నిర్వహించే ఎన్నికలలో చురుకుగా పాల్గొనాలని ఆయన కోరారు.

# రైతు పండుగకు.. ఏర్పాట్లు పూర్తి

- నేడు సదస్సును ప్రారంభించనున్న మంత్రులు తుమ్మల, జూపల్లి, దామోదర రాజనర్సింహా
- 30న హాజరు కానున్న సీఎం రేవంత్ రెడ్డి
- అమిస్తాపూర్ వద్ద ఏర్పాట్లను పర్యవేక్షించిన కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబరు 27 ప్రభాతవార్త :** ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలలో భాగంగా ఈనెల 28 నుండి 30 వరకు మహబూబ్ నగర్ జిల్లా భూత్పూర్ మండలం అమీస్తాపూర్ శివారులో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్న రైతు పండుగ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. ఈ రైతు పండుగ కార్యక్రమంలో వ్యవసాయ, వ్యవసాయ ఆధారిత రంగాలకు సంబంధించి రైతులకు శిక్షణతో పాటు, అవగాహన కల్పించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. రైతు పండుగ సంబరాలలో భాగంగా ఈ నెల 30న రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి రైతు పండుగకు హాజరుకానున్న దృష్ట్యా ఏర్పాట్ల విషయమై ఆమె బుధవారం అమిస్తాపూర్ వద్ద ఏర్పాటు చేస్తున్న రైతు పండుగ" ఏర్పాట్లను ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన ప్రారంభమై సంవత్సరం పూర్తి కావస్తున్న దృష్ట్యా నిర్వహిస్తున్న వేడుకల్లో భాగంగా వివిధ జిల్లాలలో రకరకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లాలో 28 నుండి 30 వరకు రైతు పండుగను పెద్ద ఎత్తున మూడు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ రైతు పండుగలో వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాలలో అన్ని రైతులకు సంబంధించిన అంశాలపై ప్రదర్శన, శిక్షణ ,అవగాహన నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రత్యేకించి వ్యవసాయ రంగంలో వస్తున్న ఆవిష్కరణలు, వ్యవసాయ యాంత్రికరణ, విత్తనాలు, పురుగుమందులు, ఎరువులు అన్నింటిపై రైతులకు అవగాహన కల్పించేందుకు సదస్సు నిర్వహించడం జరుగుతున్నదని, ఈ రైతు శిక్షణ అవగాహన కార్యక్రమాలకు వ్యవసాయ విశ్వవిద్యాలయంతో పాటు, వివిధ కంపెనీలు ,రైతు సంస్థలు, రైతుల అవగాహన కోసం కృషి చేసే వ్యక్తులు, ప్రొఫెసర్లు, ఆదర్శ రైతులు పెద్ద ఎత్తున హాజరై రైతులకు అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా ఈ నెల 30న రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి రైతు పండుగకు హాజరుకానున్నారని, ఇందుకోసం బహిరంగ సభను ఏర్పాటు చేస్తున్నామని ,ఈ బహిరంగ సభలో రాష్ట్ర ముఖ్యమంత్రి పాల్గొననున్నారని తెలిపారు. 28వ తేదీన ప్రారంభం కానున్న రైతు పండుగను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి దామోదర రాజనరసింహ, రాష్ట్ర ఎక్సైజ్, ప్రొహిబిషన్, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావులు ప్రారంభిస్తారని, ఈ కార్యక్రమానికి రాష్ట్రస్థాయి అధికారులు సైతం హాజరు కానున్నారని తెలిపారు. రైతు పండుగలో భాగంగా వ్యవసాయ వ్యవసాయ అనుబంధ శాఖల ద్వారా సుమారు 155 స్టాల్స్ ను ఏర్పాటు చేయడం జరుగుతున్నదని, మొదటి రెండు రోజుల కార్యక్రమాలకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి పెద్ద ఎత్తున రైతులు పాల్గొననున్నారని, ఇందుకోసం వారికి అవసరమైన మౌలిక సదుపాయాలు, భోజనం, తాగునీరు అంటివి ఏర్పాటు చేస్తున్నామని ఆమె వెల్లడించారు. ఈ రైతు పండుగ శిక్షణ, సదస్సు కార్యక్రమంలో భాగంగా నిరంతరం రైతులకు వీడియోలు, పిపిటి, సందేశాల ద్వారా అవగాహన కల్పించడం జరుగుతుందని ఆమె చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగంలో ఇటీవల అనేక మార్పులు తీసుకొచ్చిందని, ముఖ్యంగా రైతు రుణమాఫీ, సన్నధాన్యం వేరుగా ప్రత్యేకంగా కొనుగోలు చేయడం, సన్నదాన్యానికి 500 రూపాయలు బోనస్ ఇవ్వడం జరుగుతున్నదని తెలిపారు. జిల్లా ఎస్పీ జానకి ,రెవెన్యూ ఆదనపు కలెక్టర్ మోహన్ రావు, స్థానిక ఆర్డిఓ నవీన్, వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, తదితరులు జిల్లా కలెక్టర్ తో ఉన్నారు. కాగా అంతకు ముందు జిల్లా కలెక్టర్ అమిస్తాపూర్,నూతన కలెక్టర్ కార్యాలయం వద్ద రైతుపండుగ కోసం ఏర్పాటు చేస్తున్న స్టాల్స్‌ను, అదేవిధంగా భూత్పూర్ వద్ద పార్కింగ్, ఇతర సౌకర్యాలను పర్యవేక్షించారు.



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ విజయేంద్ర బోయి ,ఎమ్మెల్యే యెన్నెం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

# సిఎంఆర్ కేటాయింపులో చేతివాటం

## ముడుపులు తీసుకొని మూడు మిల్లులకు కేటాయింపులు

**గద్వాల, నవంబరు 27 ప్రభాతవార్త :** జోగులాంబ గద్వాల జిల్లాలో సీఎంఆర్ వడ్ల కేటాయింపులో పెద్ద మొత్తం లో చేతులు మారినట్లు మిల్లర్ల ఆరోపణలు చేస్తున్నారు.గతంలో పిడిఎస్ వ్యాపారం చేసి కేసులు నమోదు అయినా మిల్లులకు అధిక మొత్తంలో సిఎంఆర్ వడ్లు కేటాయించినట్లు మిల్లర్లు ఆరోపిస్తున్నారు. జిల్లా కేంద్రం లోని విశాలాక్షి జగదాంబ, మణికంఠ మూడు మిల్లులకు ఎందుకు ఎక్కువ మొత్తంలో సిఎంఆర్ వడ్లు కేటా యించారని మిల్లర్లు ప్రశ్నిస్తున్నారు. పౌరసరఫరాల శాఖ అధికారులు పెద్ద మొత్తంలో ముడుపులు తీసుకుని ఆ మూడు మిల్లులకు వడ్ల బస్తాలు కేటాయిస్తు న్నారని మిగతా మిల్లర్లు ఆరోపిస్తున్నారు. ఒక బస్తాకు రూపాయలు 20 చొప్పున మాములు తీసుకొంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.పిడిఎస్ బియ్యం అక్రమ రవాణాకు సంబంధించి గతంలో కేసులు కూడా ఉన్నట్లు మిగతా మిల్లర్లు ఆరోపిస్తున్నారు. అధికార కాంగ్రెస్ పార్టీ నాయకుల అండదండలతో ఈ మూడు రైస్ మిల్ల యజమానులు సిఎంఆర్ వడ్లను మిగతా మిల్లర్లకు దక్కకుండా వారే ఎక్కువ గా కేటాయింపులు చేసుకున్నట్లు మిల్లర్లు ఆరోపిస్తున్నారు. అధికార పార్టీలోని ఇరువర్గాల నాయకుల మద్దతుతో ఈ మూడు మిల్లర్లు ఎక్కువ బస్తాల వడ్లను తమ మిల్లులకు కేటాయింపులు తీసుకున్నట్లు మిల్లర్లు ఆరో పిస్తున్నారు. ఈ మూడు మిల్లులకు సీఎంఆర్ ఓట్లు ఎందుకు అధికంగా ఇస్తున్నారని బుధవారం సాయంత్రం జిల్లా జాయింట్ కలెక్టర్, పౌర సరఫరాల శాఖ అధికారికి జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులతోపాటు మిగతా మిల్లర్లు కలిసి ఫిర్యాదు చేసినట్లు సమాచారం.ఈ మూడు మిల్లుల యజమానులు గతంలో పిడిఎస్ బియ్యం అక్రమాలపై ఫిర్యాదు చేసినట్లు సమాచారం.వీరి పై సమగ్ర విచారణ జరిపించాలని కోరినట్లు సమాచారం.జిల్లాలో 62 రైస్ మిల్లు ఉన్నాయని అందరికీ సమానంగా సీఎంఆర్ వడ్లు కేటాయించాలని కూడా అడిగినట్లు తెలిసింది. ఈ విషయమై జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారికి వివరణ కోరగా జిల్లా అధికారుల సూచన మేరకు సిఎంఆర్ ఒడ్లు ఇచ్చినట్లు వివరణ ఇచ్చారు. ఇదిలా ఉండగా ఇతర జిల్లాల నుండి మన జోగుళాంబ గద్వాల జిల్లాకు వరి ధాన్యం ప్యాడి అలాట్మెంట్ చేయించాలని జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కాంబ్లె, మిగతా పాలకవర్గం సభ్యులు బుధవారం అధికారులకు వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు.జోగుళాంబ గద్వాల జిల్లా నందు రైతులు పండించిన సన్నరకం వరి ధాన్యం కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు తరలి పోయినందున జిల్లా నందు తగినంత ధాన్యం ప్రొక్యూర్మెంట్ జరగడం లేదని కాంబ్లె అధికారులకు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. మన జిల్లా నందు 62 రా రైస్ మిల్లులు ,బాయిల్డ్ మిల్లులు ఉన్నాయన్నారు. ఇట్టి మిల్లులకు తగినంత ధాన్యం ప్రొక్యూర్మెంట్ ఇక్కడ జరగడంలేదు. కేవలం ఖరీఫ్ సీజన్ మీదనే ఆధారపడి ఇక్కడి రా రైస్ మిల్లుల మనుగడ వున్నదని తెలిపారు. కావున తమరు మాపై దయవుంచి ఇతర జిల్లాల నుండి మన జిల్లాకు సన్న రకం వరి ధాన్యంను అలాట్మెంట్ చేయించగలరని వినతిపత్రంలో కోరారు.



మిల్లులో దించుతున్న సిఎంఆర్ వడ్లు

## విద్యార్థులు విద్యతో పాటు క్రమశిక్షణ, సామాజిక సేవ కలిగి

# ఉత్తమ పౌరులుగా ఎదగాలి

**గద్వాల, నవంబరు 27 ప్రభాతవార్త :** విద్యార్థులు విద్యతో పాటు క్రమశిక్షణ, సామాజిక సేవ కలిగి ఉత్తమ పౌరులుగా ఎదగాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అన్నారు. మంగళవారం గద్వాల జిల్లాలోని ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాలలో 77వ ఎన్ సి సి వార్షిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ బి. ఎం.సంతోష్ హాజరయ్యారు. ఎన్ సి సి విద్యార్థుల కవాతు, గౌరవ వందనంతో జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్, ఇంచార్జ్ విద్య శాఖ అధికారి కాంతమ్మకు ఘన స్వాగతం పలికి అతిథులను ఆహ్వానించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,జిల్లాలోనే అత్యధిక విద్యార్థిని విద్యార్థులు కలిగిన పాఠశాల అని, ఈ విద్యా సంవత్సరంలో నూతనంగా ఎన్ సి సి యూనిట్లు ప్రారంభించుకోవడం జరిగిందని అన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యతో పాటు సామాజిక సేవలో భాగస్వాములు అయ్యేలా తయారు చేయడానికి ఉపాధ్యాయులు అందరూ కృషి చేయాలని అన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలలో ఎన్ సి సి విద్యార్థుల పాత్ర చాలా గొప్పదని చదువుతో పాటు చక్కటి క్రమశిక్షణ గల ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఎన్ సి సి ఏర్పాటు యొక్క ముఖ్య ఉద్దేశం దేశ రక్షణలో భాగంగా త్రివిధ దళాలకు అనుబంధంగా పాఠశాల స్థాయిలో యూనిట్లను ఏర్పాటు చేసి వారికి కర్తవ్యం, ఐక్యమత్యం, క్రమశిక్షణ కలిగిన పౌరులుగా తీర్చిదిద్ది దేశ సంఘటిత శక్తులలో ఒకటిగా ఉండటానికి కృషి చేయాలని, యుద్ధ సమయాలలో రెండవ రక్షణ శ్రేణిగా సేవలు అందించడం, వారి స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని మీరు కూడా జీవితంలో ఉత్తమ పౌరులుగా తయారై సమాజాభివృద్ధికి తోడ్పడాలని ఆయన సూచించారు. మీ లక్ష్యాలను మరవకుండా నిరంతరం సాధనతో విజేతలు కావాలని ఆయన ఆకాంక్షించారు. అదేవిధంగా ఇంటర్ డిగ్రీ కాలేజీలలో కూడా ఎన్ సి సి యూనిట్లను ప్రారంభించాలని విద్యార్థులందరూ అందులో పాల్గొనేటట్లు చూడాలని ఆయన అన్నారు. మీకు భవిష్యత్ లో ఎన్ సి సి కోట కింద ఉద్యోగ అవకాశాలు కూడా ఉంటాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద మరుగుదొడ్లకు గాను లక్ష రూపాయలు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట నరసయ్య, సి టీ ఓ రాముడు, రిటైర్డ్ ప్రధాన ఉపాధ్యాయులు, పూర్వపు ఎన్ సి సి ఆఫీసర్లు, సెక్యూరిటీ ఆఫీసర్, వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




77వ ఎన్ సిసి కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్




జెండా ఆవిష్కరణ చేస్తున్న కలెక్టర్, పాల్గొన్న విద్యార్థులు

# గురుకుల విద్యార్థి ఆత్మహత్య

- హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు దుప్పటితో ఉరి..
- ఆందోళనలకు దిగిన విద్యార్థి సంఘాలు, ఆయా పార్టీలు ..
- విద్యాశాఖ మంత్రి ఉన్నట్టా లేనట్టా
- మదనాపురం గురుకులలో ఘటన



రోడ్ మీద ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాలు, ఆయా పార్టీల నాయకులు

**కొత్తకోట నవంబరు 27 ప్రభాతవార్త :**మదనాపురం పట్టణ కేంద్రం లో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల లో 7వ తరగతి చదువుతు న్న విద్యార్థి హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు దుప్పటితో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మదనాపురంలో జరిగింది. స్థాని కుల వివరాల ప్రకారం మదనాపురం మండలం కొన్నూర్ గ్రామానికి చెందిన శ్రీనివా సులు, సత్యమ్మ దంపతుల కుమారుడు ప్రవీణ్ 7వ తరగతి మదనాపురం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో చదువుతున్నా డు. తల్లితండ్రులు జీవనోపాధి కోసం హైదరాబాద్ వలస వెళ్లారు. ప్రవీణ్ కూడా ఇది వరకు హైదరాబాద్ ప్రాంతంలో ఉన్న గురుకులలో చదివే వాడని తల్లిదండ్రులు తిరిగి స్వగ్రామానికి వెళ్లే ఆలోచనలో తమ కుమారు డు ప్రవీణ్ కూడా మాకు అందుబాటులో ఉండేలా మదనాపురం గురుకులకు ఇటీవల ట్రాన్స్ఫర్ చేయించుకున్నారు. తల్లితండ్రులు హైదరాబాద్‌లో ప్రవీణ్ కొత్తగా ఇక్కడ చదువు కోవడంతో కొంత మానసికంగా క్రుంగిపోయాడు. ఇదే క్రమంలో గురుకులలో కబడ్డీ అటఆడుతూ కిందపడి స్వల్పగాయాలు అయ్యాయి. బుధవారం ప్రవీణ్ తండ్రికి ఫోన్ చేసి నన్ను తీసుకెళ్ళు అని ప్రాధేయపడ్డాడు. ఫోన్లో తండ్రి అన్న మాటలకు మానసికంగా, బావోద్వేగానికి లోనైనా విద్యార్థి ప్రవీణ్ హాస్టల్ గదిలోకి వెళ్లి దుప్పటి తీసుకోని ఫ్యాన్ కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. ఈ విషయం విద్యార్థులు గుర్తించి ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులకు సమా చారం అందించారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు ఈ విషయాన్నీ బయటకు రాకుండా దాదాపు 4 గంటలు దాచారు. ఈ విషయం అక్కడ ఇక్కడ పాకీ అందరికి తెలిసింది. వెంటనే పోలీసులు సం ఘటన స్థలానికి చేరుకొని మృతి చెందిన విద్యార్థి ప్రవీణ్ ను వనపర్తి ఏరియా హాస్పిటల్ కు తరలించారు.



మృతి చెందిన విద్యార్థి ప్రవీణ్ (ఫైల్)

**ఆందోళనకు దిగిన విద్యార్థి సంఘం, ఆయా పార్టీలు**

మదనాపురం గురుకుల పాఠశాలలో ఫ్యాన్ కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన తెలిసిన వెంటనే స్థానిక నాయకులు ఆయా సంఘాల నాయకులు విద్యార్థులు రోడ్ ను బైటయించారు. పాఠశాలలో ఆందోళనకు దిగారు. విద్యార్థి చావుకు అధికారుల నిర్లక్ష్యం, ప్రభుత్వమే కారణమని రోడ్ మీద ధర్నా చేశారు. ముందుగా పాఠశాల విద్యార్థులు రోడెక్కి ధర్నా చేశారు. అనంతరం బిఆరెస్, సిపిఎం, సిపిఐ, బీజేపీ పార్టీల నాయకులు ఆందోళనకు దిగారు. బిఆరెస్ నాయకులు వామన్ గౌడ్, చెన్నకేశవ రెడ్డి, బిట్లి యాదగిరి, కృష్ణయ్యలు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం దాటినా నేటికీ విద్యా శాఖను ఏర్పాటు చేయలేదని అసలు విద్యాశాఖ ఉన్నట్టా లేనట్టా అని ప్రశ్నించారు. అసమర్థత పాలన చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే రాజీనామా చేయాలనీ డిమాండ్ చేశారు. మరోపక్క మాగనూరులో కూడా విద్యార్థులకు ఫుడ్ ఫాయిజన్ అయిన సంఘటన రాష్ట్రవ్యాప్తంగా తెలుసనీ ఇంత వరకు ముఖ్యమంత్రి విద్యార్థులను కనీసం పరామర్శించలేదని మండిపడ్డారు. విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం మొసలికన్నీరు కారుస్తుందని మండిపడ్డారు. తెలంగాణ రాష్టంలో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ఉన్నప్పుడు గురుకులలో ఎలాంటి సంఘటనలు జరగలేదని గురుకులాలు అంటే కార్పొరేట్ స్కూల్ మాదిరిగా అభివృద్ధి చేసిన ఘనత ఉందని ఇప్పుడు అదే గురుకులలో చావు కేకలు వినిపిస్తున్నాయని అన్నారు. గురుకులాల్లో విద్యార్థులు చదవాలంటే బయపడుతున్నారని అన్నారు. మృతి చెందిన కుటుంబానికి ప్రభుత్వం వెంటనే

- మిగతా3లో..

## ఆరుగ్యారంటీల అమలులో ప్రభుత్వం విఫలం

**బిజెపి రాష్ట్ర నాయకులు మెంటేపల్లి పురుషోత్తంరెడ్డి**

**వనపర్తి క్రైమ్ నవంబరు27 ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయడంలో విఫలమైందని భాజపా సీనియర్ నాయకుడు,రాష్ట్రసర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు మెంటేపల్లి పురుషోత్తంరెడ్డి, విమర్శించారు. బుధవారం మండలంలోని నాచహల్లి గ్రామంలో భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు రామన్న వెంకటేశ్వర రెడ్డితో కలిసి బూత్ కమిటీ ఎన్నికసం దర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ పార్టీ నుండి వార్డ్ మెంబర్,సర్పంచ్,ఎంపీటీసీ,జెడ్పిటీసీ, సింగిల్ విండో ఎన్నికల్లో పోటీ చేసి సత్తా చాటుదామని ప్రతినెలా చివరి ఆదివారం ప్రధాని నరేంద్రమోడీ దేశ ప్రజానీకంతో సంభాషించే మన్‌కీబాత్ కార్యక్రమాన్ని విని కేంద్ర ప్రభుత్వ పథకాలను గ్రామంలోని ఇంటింటికి తెలియజేయాలని గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేసే ఉద్దేశంతో బూత్ కమిటీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. బూత్ కమిటీ అధ్యక్షుడిగా కావలి అంజనేయులు, కార్యదర్శిగా బర్ల మల్లేష్, మాన్‌కీ బాత్ ప్రముఖ్ మిద్దె శ్రీకాంత్, వాట్సాప్ గ్రూప్ ప్రముఖ్ నవీన్,సభ్యులుగా సురేష్ గౌడ్, బర్ల వెంకటేష్, మిద్దె శివ,సాయికుమార్,శివకుమార్,లక్ష్మయ్య, పెంటయ్యలను ఎన్నుకున్నారు.


బూతు కమిటీలో పాల్గొన్న బీజేపీ నాయకులు

## ఎస్ఎస్‌సి విద్యార్థుల ప్రేరణ తరగతులు

**విద్యార్థుల్లో భయం పారదోలడనికి ప్రత్యేక కార్యక్రమం**

**పెబ్బేరు నవంబరు 27 ప్రభాతవార్త :** పెబ్బేరు మండలంలోని యాపర్ల గుమ్మడం అయ్యవారిపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్లో ఎస్ఎస్‌సి విద్యార్థుల కోసం ప్రేరణ శిక్షణా తరగతులు నిర్వహించారు. విద్యార్థులకు వార్షిక పరీక్షలపై అవగాహన కల్పించే లక్ష్యంతో రూపొందించిన ప్రేరణ కార్యక్రమం ప్రారంభమైంది.జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు పదవ తరగతి విద్యార్థుల కోసం డా.శ్రీనివాస్ వందే మాతరం ఫౌండేషన్‌చే విద్యార్థులకు ప్రేరణ తరగతులు గుమ్మడం పాఠశాల సముదాయ ప్రధానోపాధ్యాయులు నర్సింహారావు ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. శ్రీనివాస్ పదవతరగతి విద్యార్థుల్లో పరీక్షలు అనే భయాన్ని పోగొట్టి వారిలో ఉత్తేజం పెంపొదించి వారి మనస్సులో ఉత్సాహం నింపారు.ఇందులో ముఖ్యఅతిథులుగా మండల విద్యాధికారి జయరాములు, గుమ్మడం కాంప్లెక్స్ పరిధిలోని అయ్యవారిపల్లి ప్రధానోపాధ్యాయులు రమేష్‌బాబు,యాపర్ల ప్రధానోపాధ్యాయుల శంకర్ గౌడ్,ఆయా పాఠశాల ల విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగింది


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

## ప్రజా పాలనలో ప్రశ్నిస్తే అరెస్టులా

**అమరచింత నవంబరు 27 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలన అందిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు ఫుడ్ పాయిజన్‌తో చికిత్సకు విద్యార్థులను ఆస్పిటల్ తరలిస్తున్న మఖ్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డిని అక్రమంగా రెస్టు చేయడం దుర్మార్గమని ప్రశ్నిస్తే ప్రజాపాలనలో అరెస్టులు చేస్తారా అని అమరచింత టిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అక్కల నరసింహులు గౌడ్ మండల అధ్యక్షులు రమేష్ ముదిరాజ్ ఆత్మకూరు మార్కెట్ మాజీ చైర్మన్ ఎస్ ఏ రాజు అన్నారు. బుధవారం మఖ్తల్ మాజీ ఎమ్మెల్యే అక్రమ అరెస్ట్ కు నిరసనగా టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బస్టాండులో రాష్ట్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మక్తల్ నియోజకవర్గం లోని మాగనూరు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజన ఇవ్వకుండా ఫాస్ట్ ఫుడ్ వల్ల వల్ల విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయిందని చెప్పడం సిగ్గుచేటని వారు విమర్శించారు. ఇప్పటికైనా విద్యార్థుల పట్ల అధికారులు శ్రద్ధ వహించి విద్యార్థులకు న్యాయం చేయాలని లేనిచో టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలకు సిద్ధమవుతామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చిన్న బాలరాజ్ ,తోకలి రమేష్,డిసి పురుషోత్తం, షంషేర్ ,విజయ్ ,తెలుగు రమేష్ ,రాజ్ కుమార్ ,నారాయణ తదితరులు పాల్గొన్నారు.


అమరచింతలో మఖ్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి అక్రమ అరెస్టుకు నిరసనగా రాస్తారోకో

## విద్యార్థులకు నాస్ నిర్వహించే సర్వే పరీక్షలు

**పెబ్బేరు నవంబరు 27 ప్రభాతవార్త :** పెబ్బేరు పట్టణంలోని మోడల్స్ కళాశాలలో విద్యార్థులకు నాస్ సర్వే పరీక్షలు నిర్వహించారు. విద్యార్థుల సామర్థం ఉపాధ్యాయులు అందించే శిక్షనను పరిశీలించేందుకు సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలు ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి నిర్వహిస్తారు ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలలో సర్వే నిర్వహిస్తారు.ఈపరీక్షలో విద్యార్థులకు లాంగ్వేజ్ గణితం, ఈవిఎస్, సైన్స్,సోషల్,సబ్జెక్టులపై పరీక్షలు నిర్వహిస్తారు.వనపర్తి జిల్లావిద్యాశాఖ తరఫున 50మంది విద్యార్థిని విద్యార్థులకు నఙ్శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. విద్యార్థులు ఉన్నత చదువులు చదివి మంచి భవిష్యత్తు ఎంచుకోవాలని చదువు ద్వారానే విద్యార్థుల బౌతవ్యం ఉంటుందని వారు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా డిసిఈబి చైర్మన్ చంద్రశేఖర్, ఏఎంఓ మహానంది, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసులు, మోడల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి నరేష్,ఉపాధ్యాయులు చిన్నయ్య, డాక్టర్ బుచ్చయ్య, కమలాకర్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న నాస్ అధికారులు

## జిల్లా వైద్యాధికారికి ఘన సన్మానం

**వనపర్తి క్రైమ్ నవంబరు 27 ప్రభాతవార్త :** వనపర్తి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పదవిని చేపట్టిన సందర్భంగా, జిల్లాలోని వైద్య ఆరోగ్యశాఖలో విధులు నిర్వహిస్తున్న కమ్యూనిటీ హెల్త్ అధికారులు ఆరోగ్య విస్తరణాధికారులు కలిసి బుధవారం ఆత్మీయంగా జిల్లా వైద్యాధికారిని ఘనంగా శాలువా పులమాలతో సన్మానించారు.ఈసందర్భంగా జిల్లావైద్య అధికారి అల్లే శ్రీనివాసులు మాట్లాడు తూ అందరూ సమిష్టిగా ప్రతి ఆరోగ్య కార్యక్రమాన్ని బాధ్యతతో నిర్వహించి జిల్లాను ప్రథమ స్థానంలో ఉంచడానికి కృషి చేయాలని కోరారు.ఉద్యోగులకున్న సమస్యలను తీర్చడానికి కృషి చేస్తానని,వీలుకాని సమస్య ఏదైనాఉంటే తనదృష్టికి తీసుకురావాలని సూచించారు.అందరూ సూపర్వైజరీ స్టాఫ్ ఉన్నతాధికారుల ఆదేశాలను పాటిస్తూ విధినిర్వహణలో క్రమశిక్షణ పాటిస్తూ ఆరోగ్య కార్యక్రమాలను ప్రజలకు చేరువయ్యే విధంగా చూస్తామని అందరూ ఏకగ్రీవంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు శ్రీనివాస్ జీ,సురేష్ కుమార్ ,ఆరోగ్య విస్తరణాధికారులు రవీందర్ గౌడ్, విద్యాసాగర్,చంద్రయ్య, దామోదర్, శ్రీనివాస్ కొండ, హెల్త్ సూపర్వైజర్లు నర్సింగరావు,ఓం ప్రకాష్, సురేందర్ గౌడ్,రాములు పాల్గొన్నారు.


జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులును సన్మానిస్తున్న వైద్యాధికారులు

## వైభవంగా అయ్యప్ప స్వాముల ఇరుముడి

**పెబ్బేరు నవంబరు27 ప్రభాతవార్త:**పెబ్బేర్ పట్టణంలోని శ్రీశ్రీశ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం రోజు 60 మంది అయ్యప్ప స్వాములు ఇరుముడి కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది తెల్లవారుజామున 5 గంటల నుంచి స్వామివారికి అభిషేకం హోమం ఇరుముడి అన్నదాన కార్యక్రమాలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా మండలి పెద్ద మొత్తంలో పాల్గొని విజయవంతం చేశారు. అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు స్వామివారి అనుగ్రహంతో కొంతమంది భక్తులు ఆలయానికి వివిధ రకాలుగా చందాలు అందజేశారు. అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ వారు అభినందించారు. ఇలాగే అందరూ సహకరిస్తే కమిటీ హాల్ నిర్మాణం త్వరగా పూర్తవుతుందని కమిటీ వారు తెలియజేశారు. ఎవరైనా దాతలు ఇచ్చేవారు ఉంటే ఆలయ కమిటీ వారిని సంప్రదించాలని వారు తెలియజేశారు.


ఇరుముడి కార్యక్రమంలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు

# కోరిన కోర్కెలు తీర్చేదైవం.. శివాంజనేయస్వామి

**- నేటి నుండి నార్లోనికుంటలో ఉత్సవాలు ప్రారంభం - 1న రాత్రికి రథోత్సవం**

**దేవరకద్ర, నవంబరు 27 ప్రభాతవార్త:** కోరిన కోర్కెలు తీర్చేదైవంగా బాసిల్లుతున్నాడు దేవరకద్ర మండలంలోని నార్లోనికుంటలో శివాంజనేయస్వామి...గ్రామస్థులు స్వామి వారిని తమ ఇలవేల్పు దైవంగా కొలుస్తారు. అంతటి విశిష్టత గల స్వామి వారి ఉత్సవాలను గ్రామస్థులు ప్రతి ఏడాది అత్యతం ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది.అందులో భాగంగానే ఈఏడాది కూడ స్వామివారి ఉత్సవాలకు గ్రామస్థులు అన్ని ఏర్పాటుచేశారు.ఈనెల 29నుండి డిసెంబరు1వరకు స్వామివారి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగనున్నాయి.దీనికి గాను దేవస్థానాన్ని రంగులు వేసి ముస్తాబు చేశారు.

**స్వామి వారి ఉత్సవాల విశేషోత్సవాలు..**

దేవరకద్ర మండలం నార్లోనికుంటలోని శివాంజనేయస్వామి ఉత్సవాలు గురువారం నుండి ప్రారంభం కానున్నాయి. మొదటిరోజు స్వామివారి సన్నిధిలో ఉదయం 7గంటలకు ప్రణవ పతాకావిష్కరణ కార్యక్రమంతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. అలాగే అఖండ దీపారాధన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. 8గంటలకు స్వామి వారికి ప్రత్యేక అభిషేకం,పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. అలాగే శివరామకోటి జపయజ్ఞ గీతాజ్ఞాన యజ్ఞం సామూహిక గీతావహనం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. 30న సామూహిక గీతావహనం,ఉపన్యాస కార్యక్రమాలు,డిసెంబరు 1న యజ్ఞపూజ,సామూహిక గీతావహనం,ఆశీర్వాదములు, పూర్ణాహుతి,తీర్థప్రసాదవితరణ,అన్నసంతర్పణ,అఖండ భజన,2న తెల్లవారుజామున 4 గంటలకు రథోత్సవం కార్యక్రమాలను నిర్వహిస్తారు. అలాగే పల్లకిసేవ, స్వామివారి ఊరేగింపు,పుణ్యస్నానాలు, మహామంగళహార తి,తీర్థప్రసాద వితరణ,అన్నసంతర్పన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు తెలిపారు. కావున భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులుకావాలని వారు కోరారు.


నార్లోనికుంటలోని శివాంజనేయస్వామి దేవస్థానం

**ప్రతిరోజు సాయంత్రం ఉపన్యాసాలు..**

ఉత్సవాల సందర్భంగా దేవస్థానం ఆవరణలో ప్రతిరోజు సా యంత్రం ఉపన్యాస ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. శివరామకోటి జపయజ్ఞ సర్వాధ్యక్షులు, హైద్రాబాద్‌లోని ఘట్‌కేసర్ ఆత్మభోధ పీఠం సదానంద యోగీశ్వరుల అధ్వర్యంలో ఈ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. అలాగే ప్రతిరోజు అఖండభజన క్రమాలను నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు, దేవస్థానం భక్తబృందం సభ్యులు తెలిపారు.

## మాజీ ఎమ్మెల్యే అరెస్టుకు నిరసనగా టీఆర్ఎస్ రాస్తారోకో

**ఆత్మకూరు నవంబరు 27 ప్రభాతవార్త :** మఖ్తల్ నియోజకవర్గం లోని మాగనూర్ మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ కావడంతో మాజీ ఎమ్మెల్యే విద్యార్థులను పరామర్శించిన అనంతరం మంగళవారం అర్ధరాత్రి మఖ్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి ని అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ బుధవారం రోజు మండల కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని గాంధీ చౌరస్తాలో టిఆర్ఎస్ శ్రేణులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రాస్తారోకోనుద్దేశించి ఆత్మకూరు మండలం టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రవికుమార్ యాదవ్ ,ఆత్మకూరు మాజీ ఎంపీపీ శ్రీధర్ గౌడ్ ,తదితరులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ అస్వస్థకు గురైన విద్యార్థులను పరామర్శించడం నేరంగా భావించి రాష్ట్ర ప్రభుత్వం మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డిని అక్రమంగా అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. ప్రభుత్వ లోపాలను ఎత్తి చూపిన ప్రతి ఒక్కరిపై అక్రమ కేసులు బనాయిస్తూ అరెస్టులతో భయభ్రాంతులకు గురి చేయడాన్ని వారు తీవ్రస్థాయిలో ఖండించారు. ఇప్పటికైనా రాష్ట్రవ్యాప్తంగా గురుకుల పాఠశాలలో కానీ ప్రభుత్వ పాఠశాలల్లో కానీ నాణ్యమైన భోజనాన్ని అందించి విద్యార్థులకు సౌకర్యాలు మెరుగుపరచాలని వారు విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారం తిని విద్యార్థిని విద్యార్థులు తీవ్ర ఇక్కట్లకు గురికావడం పట్ల రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం అభ్యంతరం వ్యక్తం చేయడానికి వారు గుర్తు చేస్తూ మాజీ ఎమ్మెల్యేను తక్షణమే విడుదల చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. టిఆర్ఎస్ శ్రేణులు రాస్తారోకోక పూనుకోవడం మూలంగా ఆత్మకూర్ కొత్తకోట రహదారిపై వెళ్లే వాహనాలకు తీవ్ర ఇక్కట్లకు గురయ్యాయి అనంతరం టిఆర్ఎస్ పార్టీ నాయకులను ఆత్మకూరు ఎస్సై నరేందర్ ఆధ్వర్యంలో అరెస్టు చేసి సొంత పై విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు రామకృష్ణ, శ్రీనివాసులు, రియాజ్ ,అలీ ,పోషన్న ,జానకి ,రాములు తదితరులతో పాటుగా పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాజీ ఎమ్మెల్యే అరెస్ట్ నిరసిస్తూ ఆత్మకూరులో రాస్తారోకో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

## మహనీయులే గొప్ప మార్గదర్శకులు : విశ్రాంత డిఈఓ

**లక్ష్మిపల్లికి చేరిన సత్యశోధన పాదయాత్ర**

**దేవరకద్ర, నవంబరు 27 ప్రభాతవార్త :** విద్యార్థుల భవితకు మహనీయులే గొప్ప మార్గదర్శకులని విశ్రాంత డి ఈ ఓ డాక్టర్ శివార్చక విజయ్ కుమార్ అన్నారు. గాంధీ గ్లోబల్ ఫ్యామిలి, గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ ఆధ్వర్యంలో విశ్రాంత డిఈఓ డాక్టర్ విజయ్ కుమార్ అక్టోబర్ 2న జోగులాంబ దేవాలయం నుంచి,ప్రారంభించిన బాపు బాటలో సత్య శోధన పాదయాత్ర ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా లో వంద రోజులు వెయ్యి కిలో మీటర్ల పాదయాత్ర బుధవారం దేవరకద్ర మండలం లక్ష్మిపల్లి కి చేరింది. విజయ కుమార్ నిర్వహిస్తున్న ఈ పాద యాత్ర కు లక్ష్మీ పల్లి లో పిఆర్‌టియూటిఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు, జూనియర్ రెడ్ క్రాస్ సమన్వయ కర్త లయన్ అశ్విని చంద్రశేఖర్ , లక్ష్మిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత ,ప్రాథమిక పాఠశాలల హెచ్‌యంలు కేకే శ్రీనివాస్, ఎస్. కల్పనలు ఉపాధ్యాయులు , విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. లక్ష్మిపల్లి లోని ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యమంలో విశ్రాంత డిఈఓ డా. శివార్చక విజయ్ కుమార్ మాట్లాడుతూ జాతిపిత మహాత్మాగాంధీ చూపిన సత్యం, అహింస మార్గాలే మనకు మన జాతికి యావత్ ప్రపంచానికి శరణ్యమన్నారు.విద్యార్థులు పాఠ్యపుస్తకాలతో పాటు గౌతమబుద్ధుడు, మహాత్మాగాంధీ, స్వామి వివేకానంద, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ లాంటి మహనీయుల జీవిత చరిత్రలను విద్యార్థులు చదవాలని అన్నారు. విద్యార్థులు పుస్తక పఠనం ను పెంపొందించుకోవాలని కోరార్. మహనీయుల ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. ప్రధానంగా ఈ పాద యాత్రలో చేనేత వస్త్రధారణను ప్రోత్సహించడం, మద్యం, మత్తు మందు వాడకాలను నివారించడం, సేంద్రియ వ్యవసాయాన్ని అభివృద్ధి చేయుట, నైతిక, ఆధ్యాత్మిక విలువలతో కూడిన విద్య కృషి చేయడం వంటి తదితర ఆశయాల సాధనకై విద్యార్థులు, ప్రజల్లో చైతన్యం తేవడమే లక్ష్యంగా పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు విజయ్ కుమార్ తెలిపారు. పాద యాత్ర మహోత్తరమైనది విశ్రాంత డిఈఓ డా.విజయ్ కుమా చేపట్టిన పాదయాత్ర గొప్ప మహోత్తరమైనదని ఆర్‌టి యూటిఎస్ రాష్ట్ర అధ్యక్షులు అశ్విని చంద్ర శేఖర్ అన్నారు. విజయ్‌కుమార్ చేపట్టిన పాదయాత్ర విజయ వంతం కావాలని అశ్విని చంద్ర శేఖర్ ఆకాంక్షించారు. అనంతరం డాక్టర్ విజయ్ కుమార్‌ను ఇరు పాఠశాలల సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇరు పాఠశాలల హెచ్ఎంలు కేకే శ్రీనివాస్, ఎస్.కల్పన, శంకర్, కమల్ రాజు , మదన్ మోహన్, సుజాత , ఇషాక్ అహ్మద్ , వెంకట్రాములు, తదితరులు పాల్గొన్నారు.


శివార్చక విజయ్ కుమార్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

## రైతు పండుగని విజయవంతం చేయండి : వేముల శ్రీనివాస్ రెడ్డి

**కొత్తకోట నవంబరు 27 ప్రభాతవార్త :**రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా పాలన విజయోత్సవల్లో భాగంగా ఈనెల 28 ,29 ,30 తేదీలలో మహబూబ్‌నగర్ లో నిర్వహించే రైతు పండుగ ను ఉమ్మడి పాలమూరు జిల్లా రైతు సోదరులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కిసాన్ కాంగ్రెస్ వనపర్తి జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం కొత్తకోటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ భూత్పూర్ మండలం అమిస్తాపూర్ వద్ద రేపు ఉదయం 10 గంటలకు ఈ రైతు సదస్సు ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభిస్తారని తెలిపారు. నేడు జరగబోయే మొదటి రోజు 28న సదస్సుకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన రైతులు పాల్గొంటారని అన్నారు. రెండో రోజైన 29న జిల్లా యేతర ప్రాంతాల నుండి రైతులు హాజరవుతారని మొదటి రెండో రోజు ప్రతి రోజు 5000 మంది రైతులు పాల్గొంటారని చెప్పారు. 30వ తేదీన ప్రదర్శనలు, స్టాళ్లను తిలకించిన తర్వాత సాయంత్రం నిర్వహించనున్న బహిరంగ సభలో రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్ని రైతులను ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతారని తెలిపారు. ఈ మూడు రోజులు రైతు సదస్సు వేదికపై ఆదర్శ రైతులచే ప్రసంగాలు, ఆధునిక వ్యవసాయ విధానాలపై వివరణలు, వ్యవసాయ అనుబంధ రంగాలైన పాడి పరిశ్రమ, మత్స్య, పశు పోషణ తదితర రంగాలకు చెందిన ఆదర్శ రైతులచే ప్రసంగాలు ఉంటాయని ఒక్కొక్క పంటకు సంబంధించి ఒక్కొక్క ఆదర్శ రైతును గుర్తించి వారి అనుభవాలు ఈ సదస్సులో వివరిస్తారని తెలిపారు. ఆధునిక వ్యవసాయ యంత్ర సామాగ్రి, వివిధ రకాల పంట రీతులు, హైబ్రిడ్ వంగడాలు, ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాలపై 150 స్టాళ్లను ప్రదర్శనలో ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా ఇన్చార్జి మంత్రి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, పర్యాటకశాఖ జిల్లా మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి చిన్నారెడ్డి, వ్యవసాయ కమిషన్ చైర్మన్ ఎం కోదండ రెడ్డి, విత్తన అభివృద్ధి చైర్మన్ అన్వేష్ రెడ్డి, స్థానిక దేవరకద్ర నియోజకవర్గ శాసనసభ్యులు జి మధుసూదన్ రెడ్డి తోపాటు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రభుత్వ ఉన్నంత అధికారులు పాల్గొంటున్నారని తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి ఎన్ జే బోయోజ్, మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎల్లంపల్లి నరేందర్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మేస్త్రి శ్రీనివాసులు,సలీం ఖాన్, ప్రచార కార్యదర్శి పి మోహన్ రెడ్డి, మండల పార్టీ నాయకులు జెసిపి రాములు, విండో డైరెక్టర్ రాంలాల్ నాయక్ , మాజీ మార్కెట్ డైరెక్టర్ నరేందర్ సాగర్, మాజీ వార్డ్ మెంబర్ జె సుభాష్, గోకరయ్య నాయుడు, పట్టణ మాజీ అధ్యక్షుడు కదిరె సాయిలు యాదవ్, యూత్ కాంగ్రెస్ నాయకులు దిలీప్ రెడ్డి, మొద్దు నవీన్ రెడ్డి, శ్రీకాంత్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశం లో మాట్లాడుతున్న నాయకులు

## మెట్టినింటికి వచ్చిన పంచాయతీ రాజ్ కమిషనర్ సృజన

**గద్వాల,నవంబరు27 ప్రభాతవార్త:**తెలంగాణ రాష్ట్ర పంచాయ తీరాజ్ కమిషనర్‌గా సృజన అధికారిక హోదాలో భర్త స్వగ్రామం ఇటిక్యాల మండలకేంద్రానికి మంగళవారం వచ్చారు. ఐఎఎస్ 2013 బ్యాచ్‌కు చెందిన సృజనరెడ్డి ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి తెలంగాణ రాష్ట్రానికి బదిలీపై వచ్చారు.ఐఎఎస్ అధికారిణి పంచాయతీ రాజ్ కార్యదర్శి హోదాలో ఇటిక్యాల మండల కేంద్రానికి రావడంతో గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. ఇటిక్యాల మాజీ సర్పంచ్ దివంగత చంద్రకళ రామిరెడ్డి మనుమడు రవితేజరెడ్డి భార్య సృజన ఐఎఎస్ అధికారిణి ఇటీవల రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కమిషనర్‌గా పదవి బాధ్యతలు చేపట్టి,అభివృద్ధి పనుల నిమిత్తం ప్రజాపాలన విజయోత్సవకార్యక్రమానికి మంగళవారం గ్రామానికి రావడం జరిగింది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు అత్త గారింటికి ఆహ్వానించా రు.అనంతరం ఇంటికి చేరుకొని కుటుంబ సభ్యులతో ఆమే వారితో మాట్లాడారు. అలాగే గ్రామ అభివృద్ధికి తన వంతుగా చేయూతనిస్తానని, అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. ఇటిక్యాల మండల కేంద్రం అభివృద్ధికి తనవంతు సహాయ, సహకారాలు అందించి అభివృద్ధికి కృషి చేస్తాను అని ఆమె హామీ ఇచ్చారు.


స్వాగతం పలికిన కుటుంబ సభ్యులు, మెట్టినింటిలో ఐఎఎస్ అధికారిణి

## సీఎం సోదరుని కూతురు వివాహానికి హాజరైన గద్వాల ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి


సిఎం రేవంత్ రెడ్డిని వివాహ వేడుకలో కలిసిన ఎమ్మెల్యే

**గద్వాల,నవంబరు 27 ప్రభాతవార్త :**శంషాబాద్ జి.ఎం.ఆర్. కన్వెన్షన్‌లో సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి సోదరుడు ఎనుముల జగదీశ్వర్‌రెడ్డి కూతురు వివాహానికి గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి పాల్గొని నూతన వదువరులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గద్దం కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సభకు రైతులు భారీగా తరలి రావాలి

**అమరచింత నవంబరు 27 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఈనెల 30న మహబూబ్‌నగర్ లో జరిగే రైతు మహా సభకు జిల్లాలో రైతులు భారీగా పాల్గొని విజయవంతం చేయాలని అమరచింత మండల కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ అధ్యక్షులు లక్ష్మి కాంత్ రెడ్డి రైతులను కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర అభివృద్ధి ప్రదాత రైతు సంక్షేమం కోసం రైతు రుణమాఫీ చేసి రైతులకు పండించిన వరి ధాన్యానికి 500 బోనస్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని ఆయన అన్నారు. ఈనెల 30న వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ముఖ్యమంత్రి సదస్సుకు జిల్లాలోని రైతులు భారీగా తరలిరావాలని ఆయన కోరారు.

## డిసెంబర్1న మాలల సింహగర్జనకు భారీగా తరలి రావాలి

**అమరచింత నవంబరు 27 ప్రభాతవార్త :** ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకిస్తూ డిసెంబర్ 1న హైదరాబాదులో జరిగే మాలల సింహగర్జన కు భారీగా తరలిరావాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి మండల కన్వీనర్ వేద విష్ణువర్ధన్ పిలుపునిచ్చారు. బుధవారం అమరచింత పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో మాలల సింహగర్జన పోస్టర్లును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణ వల్ల మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఎస్సీ వర్గీకరణ బిల్లును రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మాలల సింహగర్జనకు మండలంలోని మాల కులస్తులు భారీగా తరలిరావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రామస్వామి, రాములు, రామ్మూర్తి ,వెంకట్ రాములు ,శేఖర్ ,రమేష్ , భార్గవ్ ,పవన్ తదితరులు పాల్గొన్నారు.



## అమరచింత మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులు కేటాయించండి

**అమరచింత నవంబరు 27 ప్రభాతవార్త :** అమరచింత మున్సిపల్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని బుధవారం హైదరాబాదులోని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ శాఖ సిడిఎంఏ డైరెక్టర్ టికె శ్రీదేవిని అమరచింత మున్సిపల్ చైర్ పర్సన్ మంగమ్మ నాగభూషణం గౌడ్ కోరారు. వెనుకబడిన అమరచింత మున్సి పాలిటీకి రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించి అభివృద్ధి పనుల కి సహకరించాలని వారు కోరారు. తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ శాఖ సిడిఎం ఏ టీ కే శ్రీదేవి సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు.



## పారదర్శకంగా డాటాను నమోదు చేయాలి

**మండల తహసీల్దార్ ఎల్లప్ప**



**చిన్నచింతకుంట, నవంబరు 27 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సామాజిక సర్వేను పారదర్శకంగా ఆన్ లైన్‌లో నమోదు చేయాలని మండల తహసిల్దార్ ఎల్లప్ప తెలిపారు.ఈనెల 6 నుంచి కొనసాగిన సామాజిక, ఆర్థిక, రాజకీయ, కులగణన సర్వే ను తప్పులు దోర్లకుండా కంప్యూటర్ లో డాటాను నమోదు చేయాలని ఆయన తెలిపారు.మండలంలోని తహసిల్దార్ కార్యాలయంలో 8,మండల పరిషత్తులు 6,ఎం ఆర్ సి లో 6,ఉంద్యాలలో 4,బందర్ పల్లి లో 4,సీతారాంపేటలో 2,పరిదీపూర్ లో 4 కంప్యూటర్ లను ఏర్పాటు చేసి సామాజిక సర్వే డాటాను నమోదు చేస్తున్నామని ఆయన తెలిపారు.మండలంలో 9430 కుటుంబాలను సర్వే చేయగా వాటిలో 3600 కుటుంబాల జాబితాను నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.తహసిల్దార్ వెంట డిప్యూటీ తహసిల్దార్ చంద్రశేఖర్‌లు ఉన్నారు.

## గౌడ ఆఫిసియల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (గోపా) నూతన కమిటీ ఎన్నిక


నూతన కమిటీని సన్మానిస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, నవంబరు 27 ప్రభాతవార్త:** పట్టణంలో నూతనంగా గౌడ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని నూతన అధ్యక్షుడు సి.నారాయణగౌడ్ తెలిపారు. బుధవారంగౌడ్ అఫిషియల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ నూతన కమిటీని (గోపా)గౌరవ అధ్యక్షులు ఎల్లగౌడ్ అధ్వర్యంలో నూతనంగా ఎన్నుకోబడిన గౌరవ అధ్యక్షుడు ఎం శేఖర్‌గౌడ్, అధ్యక్షులు సి.నారాయణగౌడ్, ప్రధాన కార్యదర్శిపి.కృష్ణగౌడ్, కోశాధికారి బి.కృష్ణయ్య గౌడ్, ముఖ్య సలహాదారుగా బాలస్వామి గౌడ్, సాంబయ్య గౌడ్, మహిళ ప్రతినిధిగా గీతను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. వీరితోపాటు 30మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగిందని, నూతన కమిటీ ప్రమాణ స్వీకారం అందరి సమక్షంలో చేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ డివిజన్లో వివిధ రంగాల్లో పనిచేస్తున్నగౌడ్ ఉద్యోగస్తులు సేవలు అందిస్తున్న వారి గౌరవిస్తూ, గౌడ్‌సమాజాన్ని ఐక్యంగా ఉంచేందుకుగౌడ్ సంక్షేమ కోసం గౌడ్ సంఘం పెద్దల సహకారంతో గౌడ్ సంఘం భవన నిర్మాణానికికృషి చేస్తామనితెలిపారు.ఎన్నికైననూతనకమిటీనిశాలువాలతో ఘనంగా సన్మానించారు.

## నవ దంపతులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే


నూతన వధువరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే

**కల్వకుర్తి, నవంబరు 27 ప్రభాతవార్త:** రాజధాని హైదరాబాద్ నగరంలో బుధవారం పలువురి రాజకీయ నాయకులకు సంబంధించిన వివాహ వేడుకల్లో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొని నవ దంపతులను ఆశీర్వదించారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని తలకొండపల్లి మండలం మాజీ జిల్లా పరిషత్ సభ్యులు, ఉప్పల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ చిన్నకుమారుడి వివాహవేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నూతన దంపతులను ఆశీర్వదించారు. ఆదే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ సోదరుడి సోదరుడు జగదీశ్వర్‌రెడ్డి కుమార్తె వివాహంలో, గద్వాల మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ సరితయాదవ్ మేనకోడల వివాహంలో పాల్గొన్న ఎమ్మెల్యే నూతన దంపతులను ఆశీర్వదించారు.అయన వెంట నియోజకవర్గం, వివిధ మండలాల చెందిన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## భోజన విరామ సమయంలో నిరసన


భోజన విరామ సమయంలో నిరసన తెలుపుతున్న దృశ్యం

**కల్వకుర్తి, నవంబరు 27 ప్రభాతవార్త:** కెజిబివి ఉపాధ్యాయులకు బేసిక్ పే అమలు చేయాలని, వారి సర్వీసును క్రమబద్ధీకరించాలని టిఎస్ యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శిడాక్టర్ యం.శ్రీధర్ శర్మ అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాధ పాక్షిక అనాధ పేద బాలికలకు కెజిబివిలలో ఆవాస విధానంలో నాణ్యమైన బోధన అందజేస్తున్నమంచి ఫలితాలను సాధిస్తున్న ఉపాధ్యాయులకు ప్రత్యేకాధికారులకు,ఉద్యోగులకు, సుప్రీంకోర్టు తీర్పుననుసరించి కనీస మూలవేతనం బేసిక్‌పే అమలు చేయాలని టిఎస్ యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ యం.శ్రీధర్ శర్మ డిమాండ్ చేశారు.టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బేసిక్ పే అమలు చేయాలనే డిమాండ్‌తో చేపట్టిన దశలవారీ పోరాటంలో భాగంగా నవంబర్ 27,28 తేదీల్లో భోజన విరామ సమయంలో నిర్వహించిన నిరసన ప్రదర్శనలో భాగంగా కల్వకుర్తి కెజిబివిలో పాల్గొన్న జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ యం.శ్రీధర్ శర్మ మాట్లాడుతూ కెజిబివి సిబ్బంది కి కనీస మూల వేతనం బేసిక్ పేఅమలు చేయాలని,వారిని క్రమబద్ధీకరణ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కెజిబివి సిబ్బందికి పిఆర్సీసిఫార్సుల మేరకు ప్రతీ సంవత్సరం వేయి రూపా యల ఇంక్రిమెంట్ చెల్లించాలని, హెల్త్ కార్డులు జారీ చేయాలని హాస్టల్ నిర్వహణకు వార్డెన్లు కేర్ టేకర్లను నియమించి ఉపాధ్యాయులను బోధనేతర విధులనుండి మినహాయించాలని రెగ్యులర్ ఉపాధ్యాయినుల మాదిరిగానే సాధారణ సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. నిరసన ప్రదర్శనలో రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.చిన్నయ్య, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎ.వెంకటేశ్వర్లు, ఉమ్మడి జిల్లా పూర్వ అధ్యక్షులు ఎ.పి.మల్లయ్య, కల్వకుర్తి ,ఊర్కొండ కెజిబివి ఎస్వోలు, సిఆర్టీలు, పిజి, సిఆర్టీలు ఉద్యోగులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి



**కల్వకుర్తి, నవంబరు 27 ప్రభాతవార్త:** కల్వకుర్తి మండలంలోని తర్నికల్ గ్రామంలో బుధవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ చైర్మన్ తలసాని జనార్దన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్వకుర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని, రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దొడ్డు రకాలకు 2,320, సన్నాలకు 500రుబోనస్ కలిపి ఇవ్వడం జరుగుతుంది అన్నారు.రైతులు నాణ్యమైన ధాన్యం తీసుకువచ్చి సహకరించాలని కోరడమైనది.ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ శ్యామ్, రైతులు శ్రీను,శ్రీశైలం, కొండలరెడ్డి, ప్రభకర్, వెంకట్, సుల్తాన్,ఈశ్వర్‌రెడ్డి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర సర్వే నమోదును పరిశీలించిన తహసీల్దార్

**వెల్దండ, నవంబరు 27 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర సర్వే కంప్యూటర్ నమోదును ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో సత్యపాల్‌రెడ్డితో కలిసి తహసిల్దార్ కార్తీక్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి లబ్ధిదారు నమోదును పూర్తిస్థాయిలో నమోదు చేయాలని తప్పులు లేకుండా చూసుకోవాలని ఆపరేటర్లకు సూచించారు. త్వరగా పూర్తి చేయాలని అన్నారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి లక్ష్మణ్, ఈసీ దేవేందర్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి గిరి ఉన్నారు.

## హాస్టలను తనిఖీ చేసిన తహసీల్దార్


సరుకులను పరిశీలిస్తున్న తహసీల్దార్

**వెల్దండ, నవంబరు 27 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహం, సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలను మధ్యాహ్న భోజన సమయంలో బుధవారం తహసిల్దార్ కార్తీక్ కుమార్ పరిశీలించారు. హాస్టల్లోని వంట గదిలో ఆహార పదార్థాలను, నిత్యవసర సరుకులు, కూరగాయలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ శుభ్రమైన వాతావరణంలో వండి విద్యార్థులకు వడ్డించాలని వార్డెన్లు ఆహార పదార్థాల తో పాటు నిత్యవసర సరుకులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. ఆయన వెంట ఆర్ఐ శంకర్ ఉన్నారు.

## అమ్మవారి ఆశీస్సులతో సంతోషంగా ఉండాలి

■ మాజీ మంత్రి డాక్టర్ సి లక్ష్మారెడ్డి


పండుగలో పాల్గొన్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, నాయకులు

**జడ్చర్ల, నవంబరు 27 ప్రభాతవార్త:** పోచమ్మ తల్లి ఆశీస్సులు గ్రామస్తులందరిపై ఉండాలని తండావాసులకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి వేడుకున్నారు. జడ్చర్ల మండలం వల్లూరు గ్రామం చిన్నగుట్ట తండా గిరిజనుల సంస్కృతి సంప్రదాయ ఆరాధ్య దైవం పోచమ్మ, తుల్జాభవాని పండుగ పూజా కార్యక్రమంలో వల్లూరు మాజీ ఎంపిటిసి రవి నాయక్ ఆహ్వానం మేరకు మాజీ మంత్రి లక్ష్మారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ పాల్గొని పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ అందరూ ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. అనంతరం లక్ష్మారెడ్డిని, ఎర్రశేఖర్ శాలువాతో సత్కరించారు. ఆయన వెంట జడ్పీ మాజీ వైస్ ఛైర్మన్ కొడగల్ యాదయ్య, పిఎసిఎస్ ఛైర్మన్ సుదర్శన్‌గౌడ్, రాష్ట్ర సర్పంచుల సంఘం మాజీ కార్యదర్శి ప్రణీల్ చందర్, సీనియర్ నాయకుడు నాగిరెడ్డి, మాజీ ముడా డైరెక్టర్లు ఇంతియాజ్, శ్రీకాంత్, యువత మండల అధ్యక్షుడు వల్లూరు వీరేష్,పెద్దపల్లి మాజీ సర్పంచ్ మల్లేష్, చిన్నపల్లి మాజీ సర్పంచ్ తిరుపతయ్య, పార్వతలాల్, పాండు,గౌస్,శంకర్,తదితరులు పాల్గొన్నారు.

## కలుషిత ఆహారం ఘటనపై సమగ్ర విచారణ చేస్తున్నాం

**స్టేట్ స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ వెంకట నరసింహారెడ్డి**


విద్యార్థులతో మాట్లాడుతున్న రాష్ట్ర స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ వెంకట నరసింహారెడ్డి

**మాగనూరు, నవంబరు27 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లాలోని మాగనూరు జెడ్పి ఉన్నత పాఠశాలలో కలుషిత ఆహారం వల్ల విద్యార్థులు అస్వసతకు గురైన సంఘటన పై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరుపుతున్నామని స్టేట్ స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఇ. వెంకట నరసింహారెడ్డి తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం హైదరాబాద్ నుంచి నారాయణ పేట జిల్లాలోని మాగ నూరు మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆయన జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ తో కలిసి పాఠశాల ఆవరణలో మీడియాతో మాట్లాడారు. పాఠశాలలో అన్నింటినీ స్టోర్ గది, బియ్యం స్టాక్, వంట గదిని పరిశీలించడం జరిగిందని,నీటి నమూనాలు సేకరించి పరీక్షించడం జరిగిందని తెలిపారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించి ఉపాధ్యాయులు, విద్యార్థులతో ఫుడ్ కమిటీనీ ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. ఇకపై పాఠశాలలో రోజువారీ పరిశీలన ఉంటుందన్నారు. ప్రతిరోజూ తాజా కూరగాయలు,నాణ్యతతో కూడిన వంట సామగ్రిని భోజనం చేయడం జరుగుతుందని చెప్పారు. మండల ప్రత్యేక అధికారి, ఎంపీడీఓ,తహసిల్దార్లు క్షేత్రస్థాయిలో మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలిస్తారన్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన టీచర్స్, ఫుడ్ కమిటీ ల పర్యవేక్షణ ను రాష్ట్రంలోని మిగతా అన్ని స్కూళ్లల్లో కూడా అమలు చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లడం జరుగుతుందని ఆయన తెలిపారు. మంగళవారం పాఠశాలలోమధ్యాహ్న భోజనాన్ని ఇక్కడి తహసిల్దార్, ఎంపీడీవో, ఉపాధ్యాయులతో పాటు,కొందరు జర్నలిస్టు మిత్రు లు కూడా చేశారని, వారితో పాటు 400 మంది విద్యార్థులు భోజనం చేయగా వారిలో 20 మంది దాకా అస్వస్థతకి గురైనట్లు తెలిసిందని చెప్పారు. ప్రస్తుతం వారందరూ క్షేమంగా, ఆరోగ్యంగా ఉన్నారని, వారిలో కొందరు బుధవారం పాఠశాలకు కూడా వచ్చారని ఆయన పేర్కొన్నారు. ఈ కలుషిత ఆహారం ఘటన తాలూకు విచారణ నివేదికను తయారు చేసి ప్రభుత్వానికి పంపిస్తామని ఆయన స్పష్టం చేశారు.అయితే ఒకే ఘటనమూడు సార్లు జరగడంతో విద్యార్థులలో మనో స్థైర్యం తగ్గిందని, అందుకే తాను, కలెక్టర్, ఎస్పీ వారితో మాట్లాడి, కలిసి తిని,వారికి ధైర్యం చెప్పడం జరిగిందన్నారు. అంతకు ముందు జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మీడియాతో మాట్లాడుతూ.. పాఠశాలలో గత వారం రోజుల క్రితం జరిగిన కలుషిత ఆహార ఘటన పై విచారణ చేశామని, బయటి నుంచి తెచ్చిన నాసిరకం గుడ్ల తో కొంత సమస్య వచ్చిందని, విద్యార్థులు అస్వస్థతకుగురైన వెంటనే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అనంతరం మక్తల్ సామూహిక ఆరోగ్య కేంద్రానికి, ఆ తర్వాత మహబూబ్ నగర్ జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించి విద్యార్థులకు మెరుగైన వైద్యం చేయించడం జరిగిందని ఆమె తెలిపారు. గుడ్ల తో పాటు పాఠశాల బయటి దుకాణాలలోని తిను బండారాలను తనిఖీ చేసి ల్యాబ్‌కు పంపించడం జరిగిందని చెప్పారు. 400 మంది విద్యార్థులతో కొంతమంది కే అలాఎందుకు జరుగుతుందని, సైకాలజీ కోణంలోనూ విచారణ చేయడం జరుగుతోందన్నారు. ఇక మంగళవారం నాటి ఘటనలో ఇద్దరు, ముగ్గురు విద్యార్థులు స్వల్ప జ్వరంతో బాధ పడుతున్నట్లు తెలిసిందని, వారు స్వల్ప గాబరా చెందడంతో మిగతా విద్యార్థులు ఆందోళనకు గురయ్యారని కలెక్టర్ తెలిపారు.వారం కిందట జరిగిన ఘటన కూడా మధ్యాహ్న భోజనం వల్లే అని కాకుండా మిగతా కోణాల్లోనూ విచారణ జరుపుతున్నామని చెప్పారు. ఇకపై మళ్ళీ ఇలాంటి ఘటన పునరావృతం కాకుండా అన్ని రకాల మెరుగైన చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్, స్కూల్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ మదన్ మోహన్ ఉన్నారు.

## విద్యార్థులు చదువుపట్ల శ్రద్ధ వహించాలి

**జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి గంట కవితా దేవి**



**గద్వాల నవంబరు 27 ప్రభాతవార్త :** రూరల్ డెవలప్మెంట్ సొసైటీ, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహ ముక్త్ భారత్ కార్యక్రమాన్ని స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల యందు నిర్వహించడం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా న్యాయ సేవసంస్థ సెక్రటరీ గంటా కవిత హాజరై విద్యార్థులకు బాల్య వివాహాల చట్టాలగురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు చదువుపట్ల శ్రద్ధ వహించాలని, సామాజిక మాధ్యమాలకు దూరంగాఉండాలని తల్లిదండ్రుల మాటలను గౌరవించాలని సూచించారు. మహిళ శిశు సంక్షేమ శాఖ అధికారిని సుధారాణి, జిల్లా బాలల సంరక్షణ అధికారి నరసింహ, బాలల సంక్షేమ సమితి కమిటీ అధ్యక్షుడు సహదేవుడు, సభ్యులు జయభారతి , శైలజ,బచ్ పన్ బచావోఆందోళన్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ చంద్రశేఖర్, పాఠశాల ప్రిన్సిపల్ జహీరుద్దీన్ , వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ప్రసన్న రాణి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. సుధారాణి మాట్లాడుతూ విద్యార్థులు అందరూ చదువు పట్ల శ్రద్ధ వహించాలని, బాల్య వివాహం వంటి సామాజిక దురాచారాలను రుపుమాపడానికి అవగాహన కలిగి ఉండాలని సూచించారు, సహదేవుడు మాట్లాడుతూ పిల్లల రక్షణ మరియు సంరక్షణ కోసం బాలల సంక్షేమ సమితి ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని అని ఎవరికైనా బాలలకు ఇబ్బందులు ఎదురైనట్లయితే బాలల సంక్షేమ సమితిని సంప్రదించాలని తెలిపారు, సభ్యులు జయభారతి,శైలజ మాట్లాడుతూ విద్యార్థులు చదువుకునే వయసులో ప్రేమ వివాహాలకు దూరంగా ఉండాలని సూచించారు, ప్రసన్న రాణి మాట్లాడుతూ విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఎనిమియా వ్యాధిని నిర్మూలించవచ్చా సూచించారు,వ్యాధులు దరి చేరకుండా పరిశుభ్రత పాటించాలని విద్యార్థులకు సూచించారు,చంద్రశేఖర్ మాట్లాడుతూ దేశంలో బాల్య వివాహాలు 23 శాతం ఉన్నాయని 2025 నాటికి బాల్య వివాహాల శాతాన్ని 10శాతంకి తగ్గించి2030 నాటికి పూర్తిగా బాల్య వివాహాలు నిర్మూలించి బాల్య వివాహ రహిత భారతదేశం నిర్మించాలని కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు తమ లక్ష్యాలను నిర్దేశించుకున్నాయి, బాల్య వివాహాలను నిర్మూలించడానికి దేశవ్యాప్తంగా 217 ఎన్జిం లు 416 జిల్లాల్లో ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నాయని తెలిపారు , గద్వాల జిల్లా బాల్య వివాహాలలో 32.4 శాతం తో రాష్ట్రంలో రెండో స్థానం ఆక్రమించిందని బాల్య విహాలను నిర్మూలించడానికి 100 అక్షరసర సాధించడం దీనికి సరైన పరిష్కారం అని సూచించారు. కార్యక్రమం ముగింపు దశలో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో రూరల్ డెవలప్మెంట్ సిబ్బంది మద్దిలేటి, ధనలక్ష్మి, వడ్డేలత, విజ్జులత, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రైతును రాజు చేయడమే ధ్యేయం

**రైతు పండగకు నలుమూలల నుండి రైతులు తరలి రావాలి : మహబూబ్‌నగర్ శాసన సభ్యులు యెన్నం శ్రీనివాసరెడ్డి**

**మహబూబ్‌నగర్ బ్యూరో నవంబరు 27, ప్రభాతవార్త:** దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో రైతులకు అభివృద్ధి పథకాలు అందిస్తూ రైతును రాజును చేసేందుకు కృషి చేస్తుందని స్థానిక శాసన సభ్యులు యెన్నం శ్రీనివాసరెడ్డి అన్నారు. నవంబర్ 28 నుండి 30 వరకు మహబూబ్ నగర్ జిల్లాలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి రైతు పండగ ఏర్పాట్లను బుధవారం సాయంత్రం జిల్లా కలక్టర్ విజయేంద్ర బోయి, అధికారులతో కలిసి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు మీడియాతో మాట్లాడుతూ రైతును రాజు చేయాలనే లక్ష్యంతో దేశంలో ఎక్కడ లేని విధంగా ఒకేసారి రూ. 2 లక్షల వరకు రుణమాఫీ చేసినదని, సన్న రకం వరి ధాన్యానికి మద్దతు ధరకు కొనుగోలు చేయడంతో పాటు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వడం జరుగుతుందన్నారు. అందుకే రాష్ట్రంలో రైతులు పండగ చేసుకుంటున్నారని తెలిపారు. రైతులకు రైతు భరోసా ఇచ్చిన 3,4 నెలల్లోనే రూ. 18 వేల కోట్లతో 2 లక్షల రూపాయల వరకు రైతు రుణమాఫీ చేయడం జరిగిందన్నారు. గతంలో పని చేసిన ప్రభుత్వం లక్ష రూపాయల వరకు రుణమాఫీని విడతల వారీగా చేసి సగం చేయకుండా మిగిల్చి పోయిందన్నారు. అలాంటి మిగిల్చిపోయిన రుణాలతో సహ రైతులకు రుణమాఫీ చేయడం జరిగిందన్నారు.మూడు రోజుల పాటు నిర్వహించే రైతు పండగలో రైతులకు నాణ్యమైన లాభసాటి వ్యవసాయ చేసేందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, యాంత్రిక పరికరాల ప్రదర్శన కొరకు దాదాపు 150 స్టాళ్ల ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రైతులు స్టాళ్ల పరిశీలన అనంతరం వారికి వ్యవసాయ శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు, మేధావులతో శిక్షణ, అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు.

రైతు బిడ్డ అయిన మహబూబ్ నగర్ ముద్దు బిడ్డ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నవంబర్ 30న రైతు పండగకు విచ్చేయనున్నారని రాష్ట్రంలోని నలుమూలల నుండి రైతులు తరలి రావాలని పిలుపునిచ్చారు. రైతులు రావడానికి రవాణా సౌకర్యంతో పాటు భోజన ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.గురువారం ఉదయం భూత్పూర్ మండల పరిధిలో ఏర్పాటు చేసిన రైతు పండగను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ప్రారంభించనున్నారనీ ఇట్టి వేడుకలకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతో పాటు చుట్టుపక్కల జిల్లాల నుండి రైతులు అత్యధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

## రైతులకు అవగాహన సదస్సు

**ఊర్కొండ, నవంబరు 27 ప్రభాతవార్త:** కల్వకుర్తి-జడ్చర్ల ప్రధాన జాతీయ రహదారిపై ఊర్కొండ మండల పరిధిలోని పలువురు రైతులు తాము పండించిన పంటలను ఇరువైపులా ధాన్యాన్ని ఆరవేయడం వల్ల చోటు చేసుకునే రోడ్డు ప్రమాదాలపై కల్వకుర్తి సీఐ నాగార్జున, ఎస్ఐ వీరబాబు ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. బుధవారం సాయంత్రం ముచ్చర్లపల్లి గేటు వద్ద రహదారిపై రైతులు ధాన్యం ఆరబెట్టినరైతులతో సీఐ,ఎస్ఐలు మాట్లాడారు. ఈ సందర్భంగా సీఐ నాగార్జున మాట్లాడుతూ రోడ్లపై ధాన్యాన్ని పోయడం వల్ల వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారని రైతులు ఎవరు రోడ్డుపై ధాన్యం పోయకూడదని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది,రైతులు పాల్గొన్నారు.

## శ్రీకురుమూర్తి స్వామి సన్నిధిలో జిల్లా జడ్జిలు

**చిన్న చింతకుంట, నవంబరు 27 ప్రభాతవార్త:** పేదల తిరుపతిగా పేరుగాంచిన శ్రీకురుమూర్తి స్వామిని జిల్లా జడ్జీలు దర్శించుకున్నారు. బుధవారం సాయంత్రం జిల్లా జడ్జి పాపిరెడ్డి, ఫ్యామిలీ కోర్టు జడ్జి శ్రీదేవి కుటుంబ సమేతంగా స్వామివారి కొండకు చేరుకోగానే మంగళ వాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు.అక్కడి నుంచి స్వామి వారి ప్రధాన ఆలయంలోని మూలవిరాట్ శ్రీ కురుమూర్తి స్వామి దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.ఆలయ అర్చకులు జిల్లా జడ్జీలకు శాలువాతో సత్కరించి స్వామివారి చరిత్రను వివరించి ఆశీర్వ చనలు అందించారు .ఈ సందర్భంగా జిల్లా జడ్జిలు మాట్లాడుతూ శ్రీ కురుమూర్తి స్వామిని దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నామని తెలిపారు.వీరి వెంట దేవస్థాన చైర్మన్ గౌని గోవర్ధన్ రెడ్డి, ఎస్సై ఆర్. శేఖర్‌లు ఉన్నారు.

## కెసిఆర్ సినిమా అద్భుతం


రాకేష్‌ను అభినందిస్తున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

**జడ్చర్ల నవంబరు 27 ప్రభాతవార్త:** ఇటీవలే విడుదలైన కెసిఆర్ కేశవ చంద్ర రమావత్ ) సినిమా అద్భుతంగా చిత్రీకరించారని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి చిత్ర యూనిట్‌ను అభినందించారు. హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో కేసీఆర్ (కేశవ చంద్ర రమావత్) సినిమానుమాజీ మంత్రి హరీష్‌రావు, చిత్ర బృందంతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి సినీ నటుడు జబర్దస్త్ రాకేష్ ను ప్రత్యేకంగా అభినందించారు. గత పది ఏళ్లలో జరిగిన అభివృద్ధి, రాష్ట్రంలో తీసుకొచ్చిన విప్లవాత్మకమైన మార్పులపై సినిమాలో అద్భుతంగా చిత్రీకరించారని అభినందించారు.జడ్చర్ల మండల పరిధిలోని వల్లూరు గ్రామంలో కూడా కెసిఆర్ చిత్రంలో కొన్ని సన్నివేశాలు చిత్రీకరించినందుకు సంతోషం వ్యక్తం చేశారు.

### బాధిత కుటుంబానికి మాజీ మంత్రి లక్ష్మారెడ్డి పరామర్శ

**జడ్చర్ల, నవంబరు 27 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం పోతులమడుగు గ్రామంలో మంగళవారం ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెందిన కరుణాకర్ రెడ్డి పార్థివదేహానికి మాజీ మంత్రి లక్ష్మారెడ్డి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యం చెప్పారు. అయన వెంట సర్పంచుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రణీల్ చందర్ తదితర నాయకులు ఉన్నారు.

## గురుకుల విద్యార్థి ఆత్మహత్య

మొదటి పేజీ తరువాయి భాగం..

50 లక్షలు నష్టపరిహారం, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఇలాంటి సంఘటనలు ఏగురుకులలో జరగకుండా ప్రభుత్వ యంత్రాంగం తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టమైన హామీఇవ్వాలని ఆందోళన చేశారుస్థానిక తహసీల్దార్ అబ్రహం లింకన్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు దీనిపై పూర్తి విచారణ చేపట్టి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

## సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా కరికులం

**మహబూబ్‌నగర్ బ్యూరో నవంబరు 27 ప్రభాతవార్త :** విద్యార్థి సర్వతోముఖాభివృద్ధి కోసం కరికులం రూపకల్పన జరిగిందని, త్వరలో రెగ్యులర్ కోర్సు లతో పాటు నైపుణ్యా మరియు ఉపాధి ఆధారిత ప్రత్యేక కోర్సు లు ప్రవేశపెడతామని, వివిధ సంస్థలు, కంపెనీలతో ఎంవోయూ కుదుర్చుకొని కోర్సు పూర్తికాగానే విద్యార్థికి ఉపాధి దొరికే విధంగా చర్యలు చేపడుతున్నామని పాలమూరు విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ శ్రీనివాస్ అన్నారు. పీయూలో పీజీ, బి ఫార్మసీ మొదటి సంవత్సరం విద్యార్థుల కోసం జరిగిన ఇండక్షన్ ప్రోగ్రాం లో ప్రసంగించిన గౌరవ ఉపకులపతి ఆచార్య జి.ఎన్. శ్రీనివాస్, పాలమూరు యూనివర్సిటీలో పీజీ బీఫార్మసీ మొదటి సంవత్సర విద్యార్థులకు పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం గ్లోబల్ స్పీకర్ రమేష్ వేముగంటి మాట్లాడుతూ ఈ పోటీ ప్రపంచంలో నెగ్గుకు రావాలంటే ఒక భారతీయ భాషను మరియు ఒక విదేశీ భాషను అనర్గళంగా నేర్చుకోవాలన్నారు. ముఖ్య వక్త విజయ్ మోహన్ మాట్లాడుతూ యూనివర్సిటీ అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సహకారం అవసరమని, అల్యూమిని అసోసియేషన్ కీలకంగా ఉంటుందని అన్నారు. యూనివర్సిటీలోప్రశాంతమైన, అహ్లాదకరమైన వాతావరణము ఉందని, ఆధునికమైన గ్రంథాలయ సౌకర్యం, పోటీ పరీక్షలకు అవసరమగు బుక్కులు, విశాలమైన స్పోర్ట్స్ కాంప్లెక్స్,171 ఎకరాలలో క్యాంపస్ విస్తరించి ఉన్నదని, ఆదునుతానా ల్యాబ్ సౌకర్యం ఉన్నదని,పోటీ పరీక్షలకు తర్ఫీదు నిచ్చే శిక్షణా కేంద్రం ఉందని, జాబ్స్ ఇవ్వడానికి క్యాంపస్ ప్లేస్మెంట్ ఆఫీస్ సెల్ ఉందని,క్యాంపస్ ఉచిత వైఫై సౌకర్యం ఉందని వివరించారు. కార్యక్రమంలో డీన్ ప్రొఫెసర్ జయపాల్ రెడ్డి , పరీక్షల నియంత్రణ అధికారి డా.రాజకుమార్,ఓఎస్‌డీ డా. మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్ డా.ఎన్ చంద్రకిరణ్, డా.నూర్జహాన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డా.కృష్ణయ్య,వ్యాఖ్యాత డా. భూమయ్య, వివిధ విభాగాలఅధిపతులు డా.ప్రభాకర్‌రెడ్డి, డాక్టర్ పుష్పలత, డా.రాజశేఖర్ అధ్యాపకులు డా.మధు, డా. సురేష్, సురేష్ డా. బి సిద్దారమ గౌడ్, పీడీ డా. శ్రీనివాస్, పిఆర్ఓ డా.రవికుమార్,బోధనేతర సిబ్బంది నాయకులు రామ్మోహన్ జీ, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్‌రెడ్డి సభకు భారీ భద్రతా ఏర్పాట్లు

**భూత్పూర్,నవంబరు 27,ప్రభాతవార్త:** తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఈ నెల 30న భూత్పూర్‌లో జరిగే రైతు సదస్సు,ప్రజాపాలన విజయోత్సవ సభకు వస్తున్న సందర్భంగా భారీ పోలీస్ భద్రతా,బందోబస్తు చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర సౌత్ జోన్-2 ఐజీ వి సత్యనారాయణ ఐపీఎస్ స్పష్టంచేశారు.సీఎంసభకు నిర్వహిస్తున్న బహిరంగసభ,సభా ప్రాంగణ ఏర్పాట్లు,హెలిప్యాడ్ స్థలాన్ని ఐజీ బుధవారం సాయంత్రం ఐజీ పరిశీలించారు.అనంతరం ఐజీ వి సత్యనారాయణ మీడియాతో మాట్లాడుతూ సీఎం రాక సందర్భంగా భద్రత,భారీ పోలీస్‌బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.భూత్పూర్ నాలుగు రోడ్ల కూడలి ఐనందున,జాతీయ రహదారికి ఆనుకుని ఉన్నందున ట్రాఫిక్ తాకిడి భారీగా ఉంటుందని అంచనా వేస్తున్నామన్నారు.సీఎం సభకు 6గురు ఎస్పీలు,7గురుఅదనపు ఎస్పీలు,12మంది డీఎస్పీలు, 40మందిసీఐలు,40మంది ఎస్సైలసేవల్ని వినియోగిస్తున్నట్లు చెప్పారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా 2గ్రేహాండ్స్ దళాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఐజి వెంట జిల్లా ఎస్పీడిజానకి ఐపిఎస్,భూత్పూర్ సీఎం రామకృష్ణ,ఎస్సైలుచంద్రశేఖర్,శ్రీనివాసులు పాల్గొన్నారు.

## ఈపిఎస్‌పై విద్యార్థులకు అవగాహన

**నారాయణపేట టౌన్, నవంబరు27 ప్రభావతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రంలోని బ్రిలియంట్ గ్రామర్ పాఠశాలలో చేపట్టిన ఈపీఎస్ పై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ ప్రాంతీయ కార్యాలయం మాదాపూర్, హైదరాబాద్ ప్రతి నెల 27 న నిధి ఆప్కే నికట్ 2.0 (భవిష్యనిది సంస్థ ఉద్యోగుల నిర్వహిస్తుందని ఉద్యోగుల సమస్యలుఅక్కడికి అక్కడే పరిష్కారము చూపుతోందన్నారు. ఈ కార్యక్రమములో పాఠశాలలోని ఈ హి.యస్ చందాదారుడి అధిక సంఖ్యలో పాల్గోని వారి వారి సమస్యలను అడిగి నివృతి చేసుకున్నారు. ఉద్యోగుల కె.వై.సి ఆధారుతో అనుసంధానము మరియు ఎలక్ట్రానిక్ నామినేషన్ ఏలా చేసుకోవాలనే అవగాహనకల్పించారు.ఈ.పి.యఫ్ సంస్థ ద్వారా అందుతున్న పింఛను, ఇన్సూరెన్స్ మరియు పి.యఫ్ ఈ పథకాలలో అందుతున్న ప్రయోజనాలు వాటికి ఉద్యోగులు ఏలా ఆధారు బ్యాంకు పాన్ కార్డులనుఏలా అనుసందించుకోవాలో వివరించారు.ఈ కార్యక్రమములో ఈ. పి.యఫ్ ప్రాంతీయ కార్యాలయములోని నారాయణపేటజిల్లానోడల్ అధికారి డి. బబుల్యాధ్ నాయక్, సీనియర్ అధికారులు సత్యశ్రీనివాస్ బీపన్ చక్రవర్తికె.బి.రాధప్రిన్సిపాల్ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్ఎస్ఎస్ కంపెనీపై చర్యలు తీసుకోవాలి

**ఇటిక్యాల నవంబరు 27 ప్రభాతవార్త:** మండల పరిధిలోని జింకలపల్లి గ్రామ సమీపంలో 44 జాతీయ రహదారి పక్కన పది సంవత్సరాల క్రితం నెలకొల్పిన ఎన్ఎస్ఎస్ కంపెనీ ఏర్పాటు వల్ల 5 గ్రామాలకు పైగానే ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్న కంపెనీపై చర్యలు తీసుకోవాలని బుధవారం హైదరాబాదులోని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులకు వివరించి కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజనీర్ సురేష్ కు లికిత పూర్వక ఫిర్యాదును మాజీ ఎంపీపీ భర్త శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో చేశారు. ఫిర్యాదులో ఎన్ఎస్ఎస్ కంపెనీ వల్ల 5 గ్రామాల ప్రజల జీవితాలపై విషం చిమ్ముతుందని కంపెనీ నుండి వెలువడే వ్యర్థ రసాయనాలను పగటిపూట భూమిలోకి రాత్రి వేళలో లచ్చమ్మ చెరువు వరద కాలువలోకి కాలుష్యం నీటిని వదులుతున్నారని వ్యర్థ కాలుష్యం వదిలిన నీటి వల్ల విషపు నీరు భూమిలోకి ఇంకిపోయి భూగర్భ జలాలు విషపూరితంగా మారిపోతున్నాయని అలాగే చెరువులోకి వదిలిన నీరు షేకుపల్లి గ్రామ వాగు నుండి పక్కనే ఉన్న కృష్ణా నదిలోకి కలుస్తున్నాయని కంపెనీ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించి కంపెనీ నుండి వెలువడే విషపు కాలుష్యం ఇళ్లలోకి వస్తూ దుర్వాసన వల్ల ప్రజలు అనారోగ్యానికి గురై వివిధ రోగాల బారిన పడుతున్నారని అలాగే కాలుష్య విషపు నీరు పశువులు తాగడం వలన అవి కూడా ప్రాణాలు కోల్పోతున్నాయని 10 సంవత్సరాలుగా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు యాజమాన్యం దృష్టికి తీసుకుపోతున్న పెడచెవిన పెడుతున్నారని ఫిర్యాదులో వివరించారు.కూరగాయలు ఎవరు కొనడం లేదనిమాపక్కన ఉన్న భూములకు ధరలు ఉన్నాయని కానీ మా భూములు అమ్ముకుందామంటే కొనేవారు లేరని 5 గ్రామాల ప్రజలు రోజు పడుతున్న బాధలను అర్థం చేసుకొని ఎన్ఎస్ఎస్‌కంపెనీపై చర్యలుతీసుకోవాలనికాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజనీర్ సురేష్ కు వారు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో బొట్టు బిళ్ళ వీరన్న, వీరుబాబు, శేషు. గోవిందు తదితరులు ఉన్నారు.

## సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలి : అదనపు కలెక్టర్



కొనుగోలు కేంద్రాలలో రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

**వనపర్తి ప్రతినిధినవంబరు27 ప్రభాతవార్త:** ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ జి.వెంకటేశ్వర్లు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. బుధవారం ఏదుల మండల పరిధిలోని చెన్నారంలో ఐకేపీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ సందర్శించారు. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ఇండియాకు నాణ్యమైన ధాన్యంఅందించాల్సి ఉంటుందని, అందువల్ల నిబంధనల ప్రకారం వరి ధాన్యం తేమ, తాలు, చెత్త లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఈ విషయంలో వ్యవసాయ విస్తీర్ణాధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. సేకరించిన ధాన్యాన్ని నిర్దేశించిన మిల్లులకు ఎప్పటికప్పుడు తరలించాలని అదేవిధంగా ఆన్లైన్ లో నమోదు చేయాలని నిర్వాహకులను ఆదేశించారు.

## రైతు సదస్సు విజయవంతం చేయండి

**పెబ్బేరు నవంబరు 27 ప్రభాతవార్త:** పెబ్బేరు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్రాములు యాదవ్ మాట్లాడుతూ మహబూబ్‌నగర్ లో ఈనెల 30న నిర్వహించే రైతు సదస్సు కు రైతులందరూ పాల్గొని విజయవంతం చేయాలి. ఆధునాతన సాగు పద్ధతులపై వ్యవసాయ శాఖ, ఉద్యానవన,పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 28 నుంచి 150 స్టాళ్లతో వివిధ రకాలను వ్యవసాయ ఉత్పత్తుల ఏర్పాటు చేసి ప్రదర్శన ఇస్తారు. ఈ సదస్సుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్లానింగ్ బోర్డు చైర్మన్ జి చిన్నారెడ్డి, జిల్లా ఎమ్మెల్యేలు ప్రజా ప్రతినిధులు ఉన్నంత అధికారులు పాల్గొంటారు కావున రైతులందరూ ఈ సదస్సును విజయవంతం చేయాలని పెబ్బేరు మండల కిసాన్ సెల్ అధ్యక్షులు హరి కుమార్‌రెడ్డి, టౌన్ కిసాన్ సేల్ అధ్యక్షులు జగదీశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాంపురం సహదేవుడు, కృపాకర్ రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, పాతపల్లి చంద్రశేఖర్, తదితరులు ఒక ప్రకటనలో తెలియజేశారు.

## మాలల సింహగర్జన పోస్టర్ విడుదల

**బిజినపల్లి, నవంబరు 27ప్రభాతవార్త:** హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో డిసెంబర్ 1ననిర్వహించే మాలల సింహగర్జన సభను విజయవంతం చేయాలని జిల్లా అధికార ప్రతినిధి సామ మహేష్ కోరారు. మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తాలో బుధవారం మాలల సింహగర్జన పోస్టర్ను విడుదల చేశారు. ఈ సందర్భంగా సామ మహేష్ మాట్లాడుతూ ఈసభకు మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులుపిల్లి సుధా కర్ పాదయాత్రగా వస్తున్నారని ఇంటికి ఇద్దరు చొప్పున తరలివచ్చి మాలల సింహగర్జనను విజయ వంతం చేయాలని కోరారు. వాల్ పోస్టర్ విడుదల కార్యక్ర మంలోజిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కూన నిరంజన్ జిల్లా విద్యార్థి విభాగం ఎద్దుల ఉదయ్ మండల అధ్యక్షుడు ఎద్దుల వెంకటేష్ శివ సామ విష్ణు శ్రీకాంత్ బాలరాజ్ దాము మల్ల స్వామి బాలరాజ్ చరణ్ చెన్నయ్య బుచ్చన్న ఆంజనేయులు యాదయ్య చెన్నయ్య కరుణాకర్ శీను రామకృష్ణ రవి భాస్కర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

**మక్తల్, నవంబరు 27ప్రభాతవార్త:** ఇటీవల కరీంనగర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ షూటింగ్ బాల్‌పోటీలలో మక్తల్ విద్యార్థి మమ్మద్ ఫర్హన్( లిటిల్ ఏంజెల్స్‌స్కూల్), దివ్య (రామ్ రెడ్డి గూడెం గురుకుల)విద్యార్థులు పాల్గొని క్రీడా నైపుణ్యతను ప్రదర్శించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాషూటింగ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు, విశ్రాంత పీఈటి బి. గోపాలం తెలిపారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు ఈనెల 28 నుండి 30వరకు బీహార్ రాష్ట్రంలోని బుద్ధగయలో జరుగు జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటారని ఆయన తెలిపారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన దివ్య, మహమ్మద్ ఫర్హాన్ లను, అందుకు కృషిచేసిన పాఠశాలల పీఈటీలు బి. దామోదర్, అనితలను బుధవారం ప్రత్యేకంగా అభినందించారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



రోడ్డుపై బైఠాయించిన బిజెపి నాయకులు నాగూరావు నామోజీ, కార్యకర్తలు

**మాగనూరు, నవంబరు 27 ప్రభాతవార్త:** విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని విద్యార్థి సంఘాలు పిడిఎస్‌యు, ఏబీవీపీ ఎస్ఎఫ్ఐ,ప్రజా సంఘాలు, బిజెపి,సిపిఎం పార్టీల నాయకులు పాఠశాల సందర్శనకు వెళ్లే క్రమంలో పోలీసులు అడ్డుకున్నారు. పాఠశాల పరిసరాల్లో 144 సెక్షన్ అమలులో ఉందని ఎవరిని లోపలికి అనుమతించమని పోలీసులు అనడంతో రోడ్డుపైనే బైటాయించి ఆందోళన చేశారు. ఆందోళనకారులను పోలీసులు వారి వాహనాలలో పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

## ఆన్లైన్‌లో సర్వే వివరాల నమోదులో తప్పిదాలు చేయొద్దు

**నారాయణపేట టౌన్, నవంబరు27 ప్రభాతవార్త:** ఆన్లైన్‌లో సర్వే వివరాలు నమోదులో తప్పిదాలు చేయొద్దని డిఆర్‌డిఏ మొగులప్ప అన్నారు. బుధవారం దామరగిద్ద ఎంపీడీవో కార్యాలయంలో ఇంటింటా సర్వే ద్వారా స్వీకరించిన వివరాలను ఆపరేటర్లు ఆన్లైన్లో నమోదు చేస్తున్న తీరును పరిశీలించారు. అన్ని వివరాలను ఆన్లైన్లో జాగ్రత్తగా నమోదు చేయాలని సూచించారు. త్వరితగతిన పూర్తయ్యే విధంగా చూడాలని, శిక్షణ సందర్భంగా సూచించిన అంశాలను తూచ తప్పకుండా పాటించాల అన్నారు. ఇలాంటి పొరపాట్లు తప్పిదాలకు ఆస్కారం లేకుండా చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని సూచించారు. ఉత్పన్నమైతే వెంటనే అధికారుల దృష్టికి తేవాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవోతో పాటు తదితరులు ఉన్నారు.

## అభివృద్ధి బాటలో పేట వ్యవసాయ మార్కెట్

**నారాయణపేట టౌన్, నవంబరు27 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్థానిక ఎమ్మెల్యే చిట్టెం పర్ణికరెడ్డి ఆధ్వర్యంలో నారాయణపేట వ్యవసాయ మార్కెట్ అభివృద్ధి భాటలో నడుస్తుందని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాంపురం శివారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మునుపెన్నడూ లేని విధంగా పేట మార్కెట్ కు 5,01,40,206/ (ఐదు కోట్ల ఒక లక్ష నలభై వేలరెండు వందల ఆరు రూపాయల)ఆదాయం వచ్చిందని తెలిపారు. రైతులు దళారుల మాటలు నమ్మి మోసపోకుండా వ్యవసాయ మార్కెట్‌లో తమ పంటలను అమ్మి లాభపడవలసిందిగా కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న500 రూపాయలవరి బోనస్‌ను వినియోగించుకోవాలని రైతులకు తెలిపారు. ప్రస్తుత మార్కెట్ లో అధికంగా వరి,(హంస, సోనా),కందులు (ఎర్రవి, తెల్లవి) క్రయ విక్రయాలు జరుగుతున్నాయని తెలిపారు.

## కేజీబీవీ,యుఆర్ఎస్ ఉద్యోగుల నిరసనలు

**వనపర్తి క్రైమ్ నవంబరు 27 ప్రభాతవార్త:** మినిమం టైం స్కేల్ సాధన కోసం జరిగే దశల వారి పోరాటం బుధవారం వనపర్తి జిల్లాలో జయప్రదం అయినట్లు టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్.రవి ప్రసాద్‌గౌడ్, డి.కృష్ణయ్య,ఉపాధ్యక్షులు ఎండి. హమీద్ తెలిపారు. కస్తూర్బాగాంధీబాలిక విద్యాలయాలు(కె.జి.బి.వి.)పట్టణ రెసిడెన్షియల్ పాఠశాలలు (యు.ఆర్.ఎస్) ,సర్వ శిక్ష ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ టీఎస్ యుటిఎఫ్,ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త దశలవారి పోరాటంలో భాగంగా బుధవారం జిల్లాలోని వనపర్తి, పాన్గల్లు,గోపాల్ పేట్, వీపనగండ్ల, పెద్దమండడి, కొత్తకోట, రేవల్లి, ఆత్మకూరు,చిన్నంబావి,మదనాపురం,అమరచింత,గణపురం,పెబ్బేరు,శ్రీరంగాపూర్,తదితర కేజీబీవీ పాఠశాలల ఉద్యోగులు భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ,ప్లే కార్డ్స్ తో నిరసన ప్రదర్శన తెలిపారన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఉద్యోగులకు కనీస వేతనాన్ని మంజూరు చేయాలనే ఏకైక డిమాండ్‌తో టీ.ఎస్.యు.టీ.ఎఫ్.ఆధ్వర్యంలో దశాలవారి పోరాటం కొనసాగుతుందని పాఠశాలస్థాయి నిరసనలు ఎమ్మెల్యేలకు, వినతి పత్రాలు, జిల్లా స్థాయిలో రిలే నిరాహార దీక్షలు,బడ్జెట్ సమావేశాలసందర్భంగాచలోఅసెంబ్లీ కార్యక్రమంనిర్వహిస్తున్నామని తెలిపారు.

## రైతు సదస్సు విజయవంతం చేద్దాం

### వనపర్తి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్

**వనపర్తి టౌన్ నవంబరు 27 ప్రభాతవార్త:** వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘరెడ్డి ఆదేశాల మేరకు మహబూబ్‌నగర్ లో ఈనెల30న నిర్వహించే రైతు సదస్సుకు రైతులందరూ పాల్గొని విజయవంతం చేయాలనీ వనపర్తి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బి శ్రీనివాస్‌గౌడ్ బుధవారం పిలుపునిచ్చారు. ఆధునాతన సాగు పద్ధతులపై వ్యవసాయ శాఖ,ఉద్యానవన, పశుసంవర్ధక శాఖ అధ్వర్యంలో ఈ నెల28 నుంచి 150 స్టాళ్లతో వివిధ రకాలను వ్యవసాయ ఉత్పత్తుల ఏర్పాటు చేసి ప్రదర్శన ఇస్తారనీ తెలిపారు. ఈ సదస్సుకు సిఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్లానింగ్ బోర్డు చైర్మన్ జి చిన్నారెడ్డి, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి, జిల్లా ఎమ్మెల్యేలు ప్రజా ప్రతినిధులు ఉన్నత అధికారులు పాల్గొంటారని అన్నారు. కావున రైతులందరూ ఈ సదస్సును విజయవంతం చేయాలని మార్కెట్ చైర్మన్ ఒక ప్రకటనలో కోరారు.

## మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి

■ జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి బీరం సుబ్బారెడ్డి



వసతి గృహంలో ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలిస్తున్న జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి బీరం సుబ్బారెడ్డి

**వనపర్తి ప్రతినిధి నవంబరు 27 ప్రభాతవార్త:** మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి బీరం సుబ్బారెడ్డి అన్నారు .బుధవారం ఉదయం వనపర్తి పట్టణంలోని గిరిజన సంక్షేమ శాఖ బాలుర కళాశాల వసతి గృహాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులకు వండి పెట్టే కూరగాయలు ఇతర ఆహార పదార్థాల నాణ్యతను ఆయన పరిశీలించారు. విద్యార్థులకు వండిపెట్టిన ఆహార పదార్థాలను మెస్ కమిటీ సభ్యులు భోజనం చేసిన తర్వాతనే విద్యార్థులకు వడ్డించాలనినాణ్యత విషయంలో రాజి పడొద్దన్నారు. బియ్యం కానీ కూరగాయలు గాని బాగో లేకుంటే తిరిగి పంపించాలని సూచించారు. పిల్లలకు మెనూ ప్రకారం నాణ్యమైన వేడి వేడి భోజనం పెట్టాలని, విద్యార్థులు ప్లేట్లు, చేతులు శుభ్రంగా సబ్బుతో కడుక్కునే విధంగా సిబ్బంది వసతి గృహ సంక్షేమ అధికారులుపర్యవేక్షించాలనిఅన్నారు. స్టాక్ రిజిస్టర్ నిర్వాణ కచ్చితంగా పాటించాలని లేనిచో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలుఉంటాయని అన్నారు. విద్యార్థులకు భోజనం వాడేటప్పుడు ఫిల్టర్ నీళ్ల వాడాలని తాగడానికి కూడా ఫిల్టర్లు నీళ్లనే ఉపయోగించాలని వసతి గృహసంక్షేమ అధికారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమ అధికారి ఎం. నరసింహ, వసతి గృహ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాలలో ఎదగాలి

### విద్యార్థులు ఉన్నత లక్ష్యాలపై దృష్టి సారించాలి : వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా ఎస్పీ రావుల గిరిధర్

**వనపర్తి క్రైమ్ నవంబరు 27 ప్రభాతవార్త:** ఆడపిల్లలపై చిన్న చూపువద్దనీ అడ్డంకులను, కష్టాలను అసమానతలను ఆదిగమిస్తూ ముందుకు సాగాలనీ ఎస్పీ రావుల గిరిధర్ సూచించారు. విద్యార్థినిలు ఉపాధ్యాయులసూచనలూ పాటిస్తూ ఉన్నత లక్ష్యాలపై దృష్టి పెట్టాలని, ఏలాంటి ఆకర్షణలకు గురి కావద్దని, ఏలాంటి వేదింపులకు నిరాదరణకు గురైన బాధిత మహిళలు, బాలికలు మౌనం వీడి నిర్భయంగా పోలీసుల దృష్టికి తీసుకొచ్చి వేధింపులనుండి బయట పడాలని ఎస్పీ రావుల గిరిధర్ ఐపీఎస్ తెలిపారు. బుధవారం రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో తెలంగాణగిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ భారత్ కార్యక్రమానికి వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ముఖ్యఅతిథిగా పాల్గొని అన్ని శాఖల అధికారులతో కలిసి జ్యోతి ప్రజ్వలనచేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ మహిళలు అన్నీ రంగాలలో ఎదుగుతున్నారని, ఆడపిల్ల అనగానే చిన్న చూపు చూడకుండా తల్లిదండ్రులుఆడపిల్లలకు మగపిల్లలతో సమానంగా స్వేచ్ఛను ఇవ్వాలని, మగ పిల్లలతో సమానంగా చదివించాలని, అప్పుడే ఆడపిల్లలు మగ పిల్లలతో సమానంగా అన్నీ రంగాలలో దూసుకెలతారని అన్నారు. మారుతున్న సమాజానికి అనుగుణంగా మహిళల పురోగతి కూడా ఎంతో ప్రాధాన్యం వహిస్తున్నదని, ఒక మహిళా చదువుకొని వుంటే ఆమె తన పిల్లలకు సమాజం పట్ల అవగాహనే కల్పించే అవకాశం వుంటుంది కాబట్టి ఆడపిల్లలను చదివించాలని, ఎప్పటికప్పుడు తమ పిల్లలకు సమాజంలో జరుగుతున్న మంచి చెడుపై అవగాహన కల్పిస్తూ వుండాలని అన్నారు. ఒక ఆపదకర పరిస్థితివస్తే వాటిని ఏవిధంగా ఎదురుకోవాలని, వాటిని ఎలా పరిష్కరించుకోవాలి అనే వాటిపై అవగాహన కల్పించాలని అన్నారు. కుటుంబ ఆర్థిక భారాలను సైతం నేడు స్త్రీ శక్తి లాగుతోందని, ఉన్నత శిఖరాలను చేరుకుని పురుష శక్తికి తామేమీ తీసిపోమని చాటిచెపుతోందని మేము ఇంటికే పరిమితం కాదంటూ పురుషులకు ధీటుగా విజయాలు సాధిస్తున్నారనిఅడ్డంకులను, కష్టాలను,అసమానతలను ఆదిగమిస్తూ ముందుకు సాగాలని మహిళా సాధికారత యే జాతి సాధికారత అని కుటుంబానికి, సమాజానికి, దేశాభివృద్ధికి మహిళల సేవా, త్యాగం, కృషి చాలా అవసరమని అయన అన్నారు. విద్యార్థినిలు ఏలాంటి వేదింపులకు గురైన వెంటనే డయల్ 100 ల పోన్ చేసి సమచారం అందించాలని వేధింపుల నుండి బయటపడాలని, బాదితుల వివరాలు గోప్యంగా ఉంచబడుతాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ యాదయ్య, జిల్లా మెడికల్ అధికారి, డా, శ్రీనివాసులు, జిల్లా పంచాయతీ అధికారి, సురేష్ కుమార్, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి, రాంబాబు, రూరల్ డెవలప్మెంట్ సొసైటీ చైర్మన్, చెన్నామ్మ తామస్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, సరస్వతి, డిఆర్‌డిఏ, ప్రభాకర్, సకి సిఏ. కవిత, భరోస శిరీష, సౌజన్య, వనజ, విజయ్‌కుమార్, విష్ణు, పాఠశాలవిద్యార్థినిలు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## దీక్షా దివాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం

### మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఎస్ రాజేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

**నారాయణపేట టౌన్, నవంబరు27 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రంలో ఈనెల 29న జరిగే దీక్షా దివాస్ కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నారాయణపేట తొలి శాసన సభ్యులు బిఆర్ఎస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్. రాజేం దర్‌రెడ్డి అన్నారు. బుధవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని బి ఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో నారాయణపేట మాజీ ఎమ్మెల్యే, జిల్లా అధ్యక్షులు యస్.రాజేందర్‌రెడ్డి, మక్తల్ మాజీ శాసనసభ్యులు చిట్టెం రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ దీక్ష దివాస్ జిల్లా ఇంచార్జ్ కోటిరెడ్డి జిల్లా పార్టీ నాయకులతో కలిసి, సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవంబర్29, 2009న కేసీఆర్ చేపట్టిన నిరాహార దీక్షను మరొక్కసారి యాది చేసుకుంటూ బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు నవంబర్ 29న నారాయణపేట జిల్లా కేంద్రంలో దీక్ష దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిద్దామన్నారు. స్వరాష్ట్ర కల సాకారానికి పునాది వేసిన రోజుగా తెలంగాణ చరిత్రలో నిలిచిపోయే శుభదినం అన్నారు. ఈ సందర్భంగా నవంబర్ 29వ తేదీన దీక్షా దివస్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించవలసిన విధివిధానాలపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి దీక్ష దివస్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ తెలంగాణ సమాజాన్ని ఐక్యం చేసిన సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ, ఉద్యమ స్ఫూర్తిని ప్రజలకు గుర్తు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా పదాధికారులు, ముఖ్య నాయకులు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బాలికల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం



విద్యార్థులకు ఓటు హక్కు ప్రాముఖ్యతపై అవగాహన చేస్తున్న దృశ్యం

**వనపర్తి టౌన్ నవంబరు 27 ప్రభాతవార్త:** మహిళా శిశు సంక్షేమ శాఖలోని జిల్లా మహిళా సాధికారిక కేంద్రం అధ్వర్యంలో బుధవారం వనపర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు బేటి బచావో బేటి పడావో అవగాహన, గాంధీ నగర్ లోని ప్రాథమిక ఆసుపత్రిలో గర్భిణీలకు బాలింతలకు బాలిక యొక్క ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా డిస్టిక్‌మిషన్ కోఆర్డినేటర్ ఎస్‌భాస్కర్ మాట్లాడుతూ విద్యార్థులకు అమ్మాయి విద్య ప్రాముఖ్యత గురించి లింగ వివక్షత రూపుమాపుట గురించి విద్యార్థులకు ప్రాథమిక, మాధ్యమిక స్థాయిలో డ్రాప్ ఓటు రేట్‌ను తగ్గించడం ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్యను పెంచాలని అన్నారు. గాంధీనగర్‌లోని ప్రాథమిక ఆసుపత్రిలో గర్భిణీలకు బాలింతలకు బాలిక యొక్క ప్రాముఖ్యతను తెలియజేసి చిన్నపిల్లలకు ఉన్నటువంటి సుకన్య సమృద్ధి యోజన స్కీమ్ గురించి వారికి తెలియజేయడం జరిగింది. గర్భస్థ శిశువు ఆడ, మగ అని తెలుసుకోవడం చట్టరీత్య నేరమని అవగాహన కల్పించారు. అలాగే పిల్లలకు స్వీప్ ఆక్టివిటీలో భాగంగా విద్యార్థులకు ఓటు హక్కు యొక్క ప్రాముఖ్యతను గురించి తెలియజేయడం జరిగింది. సందేహాలు ఉన్నట్లయితే 1950 టోల్ ఫ్రీ నెంబర్‌కి కాల్ చేయాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కయువత వారి యొక్క పేరును నమోదు చేసుకోవాలని ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు అనేది వజ్రాయు ధమని తెలియజేశారు. దాని ద్వారా మంచి వ్యక్తులని ఎన్నుకొని దేశ అభివృద్ధిలో పాలు పంచుకోవాలని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ మిషన్‌కోఆర్డినేటర్ ఎస్‌భాస్కర్, జనరల్ స్పెషలిస్ట్ సలోమి, స్పెషలిస్ట్ ఇన్ ఫైనాన్స్ లెట్రసీ సుమ, కళాశాల ప్రిన్సిపల్, ప్రాథమిక ఆసుపత్రి నుండి ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## వైభవంగా అయ్యప్ప పడి పూజ

**కల్వకుర్తి, నవంబరు 27 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని రాఘవేంద్రనగర్ కాలనీలో బుధవారం శేఖర్ చారి ఇంట్లో అయ్యప్పస్వామి పడి పూజ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో అయ్యప్ప స్వామి నామస్మరణతో కాలనీ మారుమోగింది. పూజ అనంతరం స్వాములకు బిక్ష ఏర్పాటు చేశారు. అయ్యప్పస్వామి దీక్ష చేపట్టిన స్వాములు 40రోజులు నల్లటి దుస్తులు ధరించి వేకువ జామున లేచి చల్లటి స్నానం చేసి అయ్యప్పస్వామి పూజలు నిర్వహిస్తామన్నారు. అయ్యప్పస్వాములు దీక్ష చేపట్టిన స్వాములు 40 రోజు తర్వాత శబరిమలై యాత్ర లో దీక్ష ముగుస్తుంది అని పవిత్రంగా గట్టి కఠినంగా పద్దతిలో అయ్యప్పస్వామి దీక్ష ఉంటుంది అయ్యప్ప స్వాములు తెలిపారు.



పడిపూజ నిర్వహిస్తున్న దృశ్యం

## హాస్టల్ విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీను నాయక్

**కల్వకుర్తి, నవంబరు 27 ప్రభాతవార్త:** హాస్టల్ విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠినమైన చర్యలు తప్పవని ఆర్డీఓ శ్రీనునాయక్ పేర్కొన్నారు. బుధవారం కల్వకుర్తి మండలం రఘుపతిపేట ఎస్సీ హాస్టల్లో ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆదేశాల మేరకు సంక్షేమ వసతి గృహాలను సందర్శిస్తూ హాస్టల్ విద్యార్థులకు మెరుగైన వసతులు భోజనాన్ని అందించేలా ఆర్డీవో చర్యలు చేపడుతున్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని మౌళిక సదుపాయాలను అందజేయాలని ఆయన వార్డెన్ సిబ్బందికి సూచించారు. ఆర్డిఓ వెంట కల్వకుర్తి డిప్యూటీ తహసిల్దార్ హరిందర్‌రెడ్డి ఆర్ఐ ఎండిరావుఫ్ హాస్టల్ వార్డెన్ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## రైతు సదస్సును జయప్రదం చేయండి

**ఆత్మకూరు నవంబరు27 ప్రభాతవార్త:** ఈనెల 30వ తేదీన మహబూబ్‌గర్ జిల్లా కేంద్రంలో జరగనున్న రైతు సదస్సును జయప్రదం చేయాలని కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘమైన కిసాన్ సెల్ జిల్లా నాయకులు వినయ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ముప్పై నా ఉమ్మడి జిల్లా కేంద్రంలో జరిగిన రైతుసదస్సుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తదితరులు హాజరవుతున్న నేపథ్యంలో అధునాతన వ్యవసాయ పద్ధతుల సాగు విధానాల గురించి విశేషమైన చర్చలు జరగనున్న నేపథ్యంలో జిల్లా వ్యాపితంగా రైతులందరూ అధిక సంఖ్యలో పాల్గొని రైతు సదస్సును జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అరెస్ట్‌కు నిరసన

**ధన్వాడ, నవంబరు 27 ప్రభాతవార్త:** ఈరోజు ధన్వాడ మండల్ హెడ్ క్వార్టర్లులో బిఆర్ఎస్ మండల నాయకులు కార్యకర్తలు ఈరోజు మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అరెస్టుకు నిరసనగా ఈరోజు నిరసన కార్యక్రమం చేయడం జరిగింది ప్రభుత్వ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా బిఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసినందుకు నిరసనగా మండల నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగిందిఈ కార్యక్రమంలో మాజీఎంపిటిసి సుధీర్ కుమార్ మండల అధ్యక్షుడు ఏ వెంకటరెడ్డి మాజీ మార్కెట్ డైరెక్టర్ శివారెడ్డి పట్టణ అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, శాంతికుమార్, నాసర్, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ ఈ నిరసనలో పాల్గొనడం జరిగింది.

## కారుకొండలో హనుమధాసు విగ్రహ ప్రతిష్ట

**బిజినపల్లి, నవంబరు27 ప్రభాతవార్త:** కారుకొండ గ్రామంలో గురువారం హనుమద్దాసు విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు యేమిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. హనుమద్దాసు ఆలయం దగ్గర బుధవారం సాయంత్రం సుందరకాండ పారాయణం అఖండ బజన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హనుమద్దాసు విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు

**కృష్ణ, నవంబరు 27 ప్రభాతవార్త:** మాగనూరు కేంద్రంలో ని జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం రోజు రెండవసారి ఫుడ్ పాయిజన్ అవడం ప్రభుత్వాధికారుల నిర్లక్ష్యమేనని, ఇదే కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం అని గుడేబల్లూరు బీఆర్ఎస్ మాజీ సర్పంచ్ అమరేష్ ముందస్తు అరెస్టు అనంతరం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని తప్పుడు కేసులు పెట్టినా, భయపడేది లేదని ప్రభుత్వ వైఫల్యాల మీదబీఆర్ఎస్ పార్టీ ఖచ్చితంగా కొట్లాడుతాదని, కార్యకర్తలు నిర్భయంగా ఉండాలని అమరేశ్ ధైర్యాన్నిచ్చారు.

## ఎస్ఎఫ్ఐ నాయకుల అరెస్టు

**మాగనూరు, నవంబరు 27 ప్రభాతవార్త:** భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలోమాగనూరు మండలం ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, సిఐటియు నాయకులను అక్రమ రెస్టులు చేయడం సరికాదని సిపిఎం సీనియర్ నాయకులు భరత్ కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరహరి పరామర్శిస్తూ వారు మాట్లాడుతూ జడ్.పి.హెచ్.ఎస్ హైస్కూల్లో నిన్న అనగా మంగళవారం రోజు 40 మంది విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయ్యి 40 మంది విద్యార్థులను హాస్పిటల్లో మక్తల్ హాస్పిటల్‌కి తరలించారు విద్యార్థులకు నానమైన భోజనం అందించకుండా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కాంగ్రెస్ విద్యార్థుల జీవితాలతోచెలగాటమాడుతు నారాయణపేట జిల్లాకలెక్టర్ సిక్తపట్నాయక్ గత వారం రోజుల క్రితంఎక్కడ ప్రభుత్వ హైస్కూల్లో ఉన్నటువంటి హెడ్మాస్టర్, ఎంఈఓ, డీఈవో ని సస్పెండ్ చేశారు కానీ మళ్ళీ అదే పరిస్థితి జెడ్పిహెచ్ఎస్ హైస్కూల్‌లో మళ్లీ ఫుడ్ పాయిజన్ జరిగింది దీనికి కారణం జిల్లా కలెక్టర్ గారిని తక్షణమే సస్పెండ్ చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేస్తుంది. అక్రమ అరెస్టులు చేసిన ఎస్ఎఫ్ఐ మరియు డివైఎఫ్ఐ, సిఐటియు నాయకులు పరామర్శిస్తున్న సందర్భంగా ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆంజనేయులు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బాలు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు నరసింహ, నయుం, డివైఎఫ్ఐ నాయకులు రాఘవేందర్, నరేష్, ఎస్ఎఫ్ఐ మండల నాయకులు సాకేత్, అంబరీష్, శివ, తదితరులు పాల్గొన్నారు.

## బీమా చెక్కు అందజేసిన మాజీ ఎమ్మెల్యే

**నారాయణపేట టౌన్, నవంబరు 27 ప్రభాతవార్త:** నారాయణపేట బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలోని బుధవారం మరికల్ మండలం తీలర్ గ్రామానికి చెందిన భారాస కార్యకర్త ఆవుల బాల్ రాజ్ ఇటీవల ప్రమాదశాత్తు మరణించినందున వారికి భారాస పార్టీ సభ్యత్వం నమోదు చేసుకున్నందున పార్టీ తరపున రూ.2.00 లక్షల భీమా చెక్కును వారి భార్య ఆవుల శారదకు మాజీ శాసనసభ్యులు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు శ్రీ.యస్.రాజేందర్‌రెడ్డి అందజే శారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

## అడ్వకేట్‌ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

**నారాయణపేట టౌన్, నవంబరు 27 ప్రభాతవార్త:** నారాయణ పేట జిల్లా కేంద్రంలో అడ్వకేట్ సలీమ్ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఎస్ఆర్ రెడ్డి ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించి ధైర్యాన్ని ఇచ్చారు. ఆయన వెంట బి.ఆర్.ఎస్. సీనియర్ నాయకులు, మైనార్టీ నాయకులు ఉన్నారు.

## కల్వర్టును మూసివేయండి

**అయిజ నవంబరు27 ప్రభాతవార్త:** పట్టణంలోని వాల్మీకి దేవాలయం సమీపంలో గల కల్వర్టును మూసివేయాలని భారతీయ జనతాపార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి కంపాటి భగత్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ ఏఈ రాజశేఖర్ కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దవాగు వంతెన నుంచి వాల్మీకి గుడి దగ్గరికి వచ్చే రహదారిని పెంచేందుకు, ట్రాఫిక్ సమస్యను తగ్గించడానికి వాల్మీకి గుడి దగ్గర ఉన్నటువంటి కల్వర్టును మూసి వేయాలని లేదా నూతనంగా కల్వర్టు ఏర్పాటు చేసి ప్రధాన రహదారిని వెడల్పు చేయాలనీ కోరారు. వాల్మీకి గుడిని అనుకోనీ ఉన్న డ్రైనేజీ పైన పదాచారులు నడుచుటకు వీలుగా ఏర్పాటు చేయాలనీ అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో జిల్లాఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు లక్ష్మనాచారి, బి.నాగరాజు, భీమన్న, చిన్న ఆంజనేయులు, పి.రాముడు తదితరులు పాల్గొన్నారు.

## యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం

**బిజినేపల్లి, నవంబరు 27 ప్రభాతవార్త:** యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పెంపొంతుందని, ప్రతీఒక్కరు తన జీవనశైలిలో యోగాను భాగస్వామ్యం చేసుకోవాలని మెడికల్ ఆఫీసర్ డా.అజహార్ సూచించారు. ఆయుష్ విభాగం బుధవారం బిజినేపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో యోగా శిబిరం ఏర్పాటు చేశారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అజహార్ మాట్లాడుతూ యువత, విద్యార్థులు, ప్రజలందరూ కూడా ప్రతిరోజు యోగా చేయటం వల్ల స్థిరమైన ఆలోచనలు కలుగుతాయని, షుగర్, బిపి, థైరాయిడ్ లాంటి జబ్బులకు దూరం కావచ్చుని, నిత్యం ఆరోగ్యంగా ఉండవచ్చని ఆయన అన్నారు. డిస్టిక్ ప్రోగ్రాం అధికారి డి ఆర్ సురేష్ మాట్లాడుతూ మానసిక ఉల్లాసం, మనోధైర్యం కూడా యోగ వల్ల కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. యోగాతో 100 సంవత్సరాల పైన బ్రతికిన వారు ఎందరో ఉన్నారని ఆయన అన్నారు. యోగా నిత్యం చేయవలసిన ప్రక్రియ అని, మన జీవన విధానంలో ఒక భాగం అని సూచించారు. ఈ కార్యక్రమంలోయోగా శిక్షకులు శివలీల, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

**వెల్దండ, నవంబరు 27 ప్రభాతవార్త:** వెల్దండ మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన గంగాపురంఅంజమ్మ మృతి చెందారు. మృతురాలి కుటుంబాన్ని మాజీ ఉపసర్పంచ్ కొప్పు ఎర్రయ్య బుధవారం కుటుంబాన్ని పరామర్శించి రూ.4వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈకార్యక్రమంలో దుగ్గాపురం యాదయ్య. వెంకటయ్య. రవి తో పాటు తదితరులు ఉన్నారు.